


# విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 17-12-2019 | VIJAYABHANU DAILY ⁎ VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 85 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## హింసాత్మక ఆందోళనలు దురదృష్టకరం

### ప్రధాని నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ: పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏ) వ్యతిరేకంగా కొనసాగుతున్న ఆందోళనలు, నిరసనలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పందించారు. సీఏఏకు వ్యతిరేకంగా హింసాత్మక ఆందోళనలు చోటుచేసుకోవడం దురదృష్టకరమని, ఇది తననెంతో బాధిస్తోందని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ఢిల్లీలో జరిగిన అల్లర్లపై ఆందోళన వ్యక్తం చేశారు. చర్చ, సంభాషణ, అసమ్మతి ప్రజాస్వామ్యంలో అతి ముఖ్యమైనవి. అంతేకానీ ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం, ప్రజాజీవితాన్ని ఇబ్బందిపాలు చేయడం మన వ్యవస్థ లక్షణం కాదు అని ఆయన పేర్కొన్నారు. మన సమాజాన్ని విభజించాలనుకునేవారి ఎత్తుగడలు పారనివ్వబోమంటూ వరుస ట్వీట్లలో పేర్కొన్నారు. భారతీయ పౌరులు ఏ మతానికి తరువాయి 2లో..

#### రాష్ట్రపతి రాక సందర్భంగా

## ఏర్పాట్లను పూర్తిచేయండి

### చీఫ్ సెక్రటరీ ఎస్‌కే జోషి

హైదరాబాద్: రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శీతాకాల విడిది సందర్భంగా అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తిచేయాలని చీఫ్ సెక్రటరీ ఎస్‌కే జోషి అధికారులను ఆదేశించారు. రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లకు సంబంధించి ఆయాశాఖల అధికారులు యాక్షన్‌ప్లాన్‌ను రూపొందించి సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. సోమవారం వివిధ శాఖల తరువాయి 2లో..

## హాట్‌హాట్‌గా అసెంబ్లీ సమావేశాలు

# సభలో మాటల యుద్ధం

### ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేసింది టీడీపీనే: చంద్రబాబు

### నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలే: సీఎం జగన్ మోహన్ రెడ్డి



అమరావతి: ఏపీ అసెంబ్లీ సమావేశాలు హాట్‌హాట్‌గా నడుస్తున్నాయి. ఆరో రోజు ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక కమిషన్‌లపై జరిగిన చర్చలో సీఎం జగన్, ప్రతిపక్ష నేత చంద్రబాబుల మధ్య మాటల యుద్ధం నడిచింది. ఎస్సీ, ఎస్టీలకు రూ.10 వేల కోట్లు కేటాయించామని.. ఎస్సీలకు న్యాయం చేసింది టీడీపీనే అన్నారు. జగన్ ఉద్దేశపూర్వకంగానే రెచ్చగొడుతున్నారని.. తాను అనని మాటల్ని అన్నట్లు చూపిస్తున్నారు. గుంటూరులో ఎస్సీ మహిళపై అత్యాచారానికి సమాధానం చెప్పాలి అన్నారు. ప్రివిలేజ్ నోటీసుపై చర్చించకుండా జగన్ పారిపోయారు అన్నారు. దళితుల గురించి మాట్లాడుతుంటే సిగ్గు లేకుండా అడ్డుకుంటున్నారని.. చంద్రబాబు వ్యాఖ్యలకు సీఎం జగన్ ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. ఓట్ల కోసం చంద్రబాబు ఎంతకైనా దిగజారే వ్యక్తి అని.. 36 ఎస్సీ, ఎస్టీల సీట్లలో టీడీపీకి వచ్చింది ఒకే ఒక్కటి అన్నారు. చంద్రబాబు నోరు తెరిస్తే అబద్ధాలేనని.. ఎస్సీ, ఎస్టీల ద్రోహి చంద్రబాబు.. అలాంటి ద్రోహి దేశంలోనే లేరు అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా అనుకుంటారా అని చంద్రబాబు అన్నారని.. ఒక్క ఎస్టీకి కూడా మంత్రి పదవి ఇవ్వని ఘనత చంద్రబాబుది అన్నారు జగన్. రాజధాని ప్లాట్ల కేటాయింపుల్లోనూ దళితులకు అన్యాయం చేశారని తరువాయి 2లో..

## దశల వారీ మద్యపాన నిషేధం

### నారా వారిది సారా పాలన ఇన్నాళ్లు చరిత్రను విన్నాం, చదివాం | జగన్ పాలనలో అది చూస్తున్నాం

### వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే ఆర్కే రోజా



అమరావతి: ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే ఆర్కే రోజా ఘాటుగా సమాధానం ఇచ్చారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలపై చంద్రబాబు చేసిన విమర్శలను ఆమె తిప్పికొట్టారు. పులిహోర తిన్నంత మాత్రాన పులులు అయిపోరంటూ ఎమ్మెల్యే రోజా ఎద్దేవా చేశారు. ఎన్ని కష్టాలు వచ్చినా, అక్రమ కేసులు బనాయించి ఎన్ని ఇబ్బందులు పెట్టినా, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిరునవ్వుతో ఎదుర్కొని ప్రజల హృదయాలను గెలుచుకుని ముఖ్యమంత్రి అయ్యారు. పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీనీ ఆయన నెరవేర్చుతున్నారు. అలాంటివారిని పులి అంటారు కానీ... పులిహోర బ్యాచ్‌ను పులి అనరు అని ఆమె వ్యాఖ్యానించారు.

మద్యపాన నిషేధంపై సోమవారం అసెంబ్లీలో చర్చ సందర్భంగా ఎమ్మెల్యే రోజా మాట్లాడుతూ... రాష్ట్రంలో దశల వారీగా మద్యపాన నిషేధం అమలు అవుతోంది. నారావారి సారా పాలన తరువాయి 2లో..

## తిరుమలలో సుప్రభాత సేవ రద్దు?



తిరుమల: కలియుగ దైవం వేంకటేశ్వర స్వామిని మేల్కోల్పడానికే ఓ ప్రత్యేక సేవ ఉంది. అది ప్రపంచ సుప్రసిద్ధం. అదే సుప్రభాతం. సుప్రభాతం పాడనిదే వేంకటేశ్వర స్వామి నిద్ర లేవడు. అలాంటి సేవను తిరుమల తిరుపతి దేవస్థానం ప్రస్తుతానికి రద్దు చేసింది. తరువాయి 2లో..

## ఇంధన పొదుపుపై విద్యుత్ వారోత్సవాలు

మండపేట: ఈ నెల 18 బుధవారం ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నామని మండపేట టౌన్ ట్రాన్స్ కో ఏ ఇ మనేపల్లి వివిఎస్ మూర్తి తెలిపారు. స్థానిక మారేడు బాక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద మీడియా తో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్న రని ఈ సందర్భంగా ఇటీవల జిల్లా స్థాయి లో కాకినాడ లో విద్యుత్ సంస్థ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఇందులో భాగంగా మండపేట పట్టణంలో గౌతమీ మునిసిపల్ పాఠశాలలో బుధవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. మండపేటలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 7 నుండి 10 వ తరగతి విద్యార్థులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశాస్తామన్నారు.

## పౌరసత్వ ప్రకంపనలు

### అమిత్ షాతో కేజ్రీవాల్ భేటీ..! .. యుద్ధ వాతావరణంగా దేశ రాజధాని

### ఆందోళనలు, నిరసనలతో అట్టడుకుతున్న ఢిల్లీ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పౌరసత్వ సవరణ చట్టంపై దేశ రాజధాని ఢిల్లీలో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. వర్సిటీ విద్యార్థుల నుంచి మొదలుకుని ప్రజాసంఘాలు, విపక్ష నేతల ధర్నాలు, ఆందోళనలతో హస్తిన అట్టడుగుతోంది. నిరసనకారులను నివారించేందుకు పోలీసులు లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం చేయాల్సి వస్తోంది. పోలీసులు, ఉద్యమకారులకు మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి. ఈ నేపథ్యంలో రాజధానిలోని తాజా పరిస్థితిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో చర్చించేందుకు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సిద్ధమయ్యారు. ఢిల్లీలో ప్రస్తుతం ఉన్న తరువాయి 2లో..




## జనవరి నుండిరైతు భరోసా కేంద్రాల ద్వారా సేవలు

### గ్రామ సచివాలయాల సిబ్బంది క్రమశిక్షణ/ మరియు బాధ్యతతో సేవలందించాలి

### జిల్లా కలెక్టరు వి.వినయ్ చంద్




విశాఖపట్నం: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అందుబాటులో ఉంచబడానికి గాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుకు గావిస్తున్నట్లు జిల్లా కలెకర్ వి.వినయ్ చంద్ తెలిపారు. ప్రతి మండలానకి 5రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుకు గాను అవసరమైన భవనాలను వివిధ శాఖల అధికారులు నుండి సంబంధిత వ్యవసాయ శాఖాధికారులు స్వాధీనం గావించుకోవాలని ఆదేశించారు. సోమవారం జిల్లాకలెక్టరు కలక్టరేట్ సమావేశమందిరములో అధికారులతో ఈ విషయముపై సమీక్షా సమావేశము నిర్వహించారు.ఈ సందర్భముగా కలక్టరు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రము నుండి రైతులు వారికి కావలసిన యంత్ర సామాగ్రి, వ్యవసాయ పనిముట్లను అక్కడ అందుబాటులో ఉన్న కియోస్క్ నందు నమోదు చేసుకున్నచో వాటిని తెప్పించి రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. మండల కేంద్రము లోగల హబ్ నందు రైతులకు కావలసిన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు అందుబాటులో ఉంచ బడుతాయన్నారు.ఈ రైతు భరోసా కేంద్రాలు జనవరి నుండి సేవలందిస్తాయన్నారు. రైతు భరోసా కేంద్రాలలో రైతులకు కావలసిన యంత్రసామాగ్రి, ఆధునిక సాగు పద్దతులు, మెళకువలు తదితర వివరాలు ప్రదర్శింప బడతాయన్నారు. గ్రామ వ్యవసాయ లేదా ఉద్యాన వన సహాయకుడు రైతు భరోసా కేంద్రము నందు విధులు నిర్వహిస్తారన్నారు. విశాఖపట్నంలో మొదటి విడతగా మండలానికి 5 చొప్పున 195రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుకు వ్యవసాయ శాఖ అధికారులుయిప్పటికే సూచించబడిన భవనాలకు అవసరమైన మరమ్మత్తులు గావించుకోవాలన్నారు. అదే విధముగా వివిధశాఖలకు సంబంధించి గ్రామ సచివాలయాలలో పని చేస్తున్న సిబ్బంది, లబ్దిదారులకు సేవలందించడములో ఎటువంటి అలసత్వాన్ని, క్రమశిక్షణా రాహిత్యాన్నిసహించేది లేదని జిల్లాకలక్టరు స్పష్టం చేసారు.సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లినప్పుడు వారితో సమావేశము ఏర్పాటు చేసి వారి పనితీరును సమీక్షించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల క్రింద లబ్దిదారుల లిస్టును ప్రకటించాలని, లబ్దిదారులకు పూర్తి సమాచారాన్ని అందించాలని తెలియజేశారు. సంబంధిత శాఖల అధికారులు వాటి అమలుకు సంబంధించిన విధి విధానాలను కమ్యూనికేట్ గావించాలన్నారు. ఎవరైనా లబ్దిదారు పేరు సదరు లిస్టు నందు లేనిచో ఎవరిని సంప్రదించాలో స్పష్టంగా తెలియజేయాలన్నారు. లబ్ది దారుల జాబితాలను పరిశీలించాలని జిల్లా జాయింట్ కలెక్టరును ఆదేశించారు. ప్రతి శాఖకు యిప్పుడు గ్రామ స్థాయివరకు సిబ్బంది ఉన్నారని ప్రతి శాఖ అధికారి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను వేగవంతం గావించాలన్నారు. సూచనలు క్రిందిస్థాయివరకు తీసుకువెళ్లాలన్నారు. గ్రామ/వార్డు సచివాలయాల ఏర్పాటులో స్ఫూర్తి, ఉద్దేశాన్ని, దృష్టిలో ఉంచుకుని ప్రజలకు సేవలనందించాలన్నారు.

**విశాఖ ఉత్సవ్ :-**

ఈ నెల 28,29 తేదీలలో విశాఖ ఉత్సవ్ నిర్వహించబడుతుందని, ఇప్పటికే అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీలు యాక్టివ్ గా పని చేస్తున్న తరువాయి 2లో..

# జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాలు

## విద్యుత్ పొదుపుపై ర్యాలీ




కాప్రేనికోన : జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాలులో భాగంగా (ఈనెల 14 నుండి 20 వరకు) విద్యుత్ శాఖ వారి ఆధ్వరలో సోమ వారం కాప్రేనికోన మరియు చిలక్కాయ చెరువులో విద్యుత్ పొదుపు పై ర్యాలీ మరియు అవగాహన కార్యక్రమం .. ఇందులో భాగంగా వినియోగదారులకు విద్యుత్ పొదుపు పై అవగాహన కల్పిస్తూ ... సాదారణ బల్బు లు కాకుండా ఎల్ఈడి బల్బులనే వాడాలని, అవ సరం ఉంటేనే విద్యుత్ని, మరియు నాణ్యమైన 5 స్టార్ రేటెడ్ విద్యుత్ పరికరాలను మాత్రమే వినియోగించాలని, కోరుతూ,తద్వారా మీ యొక్క నెలసరి విద్యుత్ బిల్ తగ్గడమే కాకుండా భావితరాలకు వెలుగులు నింప వచ్చని సూచించడం జరిగింది. ఇందులో భాగంగా చిలక్కాయ చెరువు గ్రామంలో నిరంతరం వెలుగుతున్న వీధి దీపాలను విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది సాహాయంతో సరిచేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇస్క్యూటివ్ ఇంజి నీర్ టి. శ్రీహరి, విద్యుత్ శాఖ ఉప ఇంజినీర్ కె.మోహన్. లైన్ మేన్ సరేళ్ల సత్యనారాయణ, మరియు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## చదరంగం పోటీలో రజతపతకం విజేత దేవికినందన్‌కు లాప్‌టాప్ బహూకరణ



భీమునిపట్నం : భీమిలి మండలం గ్రామ పంచాయతీ లో ఉన్న దివీస్ లేబరేటరీస్ యజ మాన్యం సుమారు లక్షా 7 వేల రూపాయలు విలువ చేసే లాప్ టాప్ ను జాతీయ స్థాయి చదరంగం పోటీలో...

రజత పతకం కైవసం చేసుకున్న దేవికినందన్ కు దివీస్ జనరల్ మేనేజర్ ఎం.ఎస్.ఎన్. రావు,డి.జి.ఎం వైయస్ కోటేశ్వరరావులు అంద జేశారు.

ఈ కార్యక్రమంలో కన్సల్టెంట్ ఎం.వర హాలరెడ్డి, సిబ్బంది డి. సురేష్ కుమార్, డి.వి.ఎస్. సన్యాసిరావు పి. ప్రసాద్‌లు పాల్గొన్నారు.

## గజపతినగరంలో ప్రారంభమైన మేల్కొల్పు పూజలు



గజపతినగరంలో మేల్కొలుపు నిర్వహిస్తున్న భక్తులు

చోడవరం : ధనుర్మాసోత్సవాలలో భాగంగా మండలంలోని గజపతినగరం, లక్కవరం, గవరవరం తదితర గ్రామాలలో మేల్కొలుపు పూజ కార్యక్రమాలు సోమవారం ప్రారంభ మయ్యాయి. ఇందులో భాగంగా ధనుర్మాసం నెలరోజులు వేకువ జామునే భక్తులతో కలసి గ్రామంలోని వీధులలో హరినామ భజనలు చేస్తూ ఊరేగింపు నిర్వహిస్తారు. అనంతరం రామాలయాలలో పూజలు నిర్వహిస్తారు. సంక్రాంతి పండుగ వరకు మేల్కొలుపు నిర్వహించడం గత కొన్నేళ్ళుగా ఆనవాయతీగా వస్తుంది. గజపతినగరం మాజీ సర్పంచ్‌లు కనిశెట్టి రామునాయుడు, మళ్ళ శ్రీనివాసరావు, బుజ్జి స్వామి, బుద్దా రామకృష్ణ, సురేష్, ఆళ్ళ రామకృష్ణ, స్థానిక మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**వేంకటేశ్వరాలయాలలో ధనుర్మాసోత్సవాలు ప్రారంభం:**

గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు జి.టి ఆఛార్యులు ఆధ్వర్యంలో ధనుర్మాసోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి.

చోడవరం ఆపదహర శ్రీనివాస క్షేత్రంలో ఆలయ ప్రధాన అర్చకులు గుంటూరు శాంతారామాఛార్యులు ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

## విధులలోకి తీసుకోవాలంటూ షుగర్ ఫ్యాక్టరీ కొత్త కాంట్రాక్టు కార్మికుల బైఠాయింపు

చోడవరం : గోవాడ ఫ్యాక్టరీ క్రషింగ్ ప్రారంభ రోజులు గడుస్తున్నా ఇంత వరకు తమను విధులలోకి తీసుకోకపోవడంపై షుగర్ ఫ్యాక్టరీ కొత్త కాంట్రాక్టు కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్ళ నుంచి ఫ్యాక్టరీనే నమ్ముకుని పనిచేస్తున్నా ఫ్యాక్టరీ మేనేజ్ మెంట్ తమను విధులలోకి తీసుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తక్షణం తమను విధులలోకి తీసుకోవాలంటూ ఏవో కార్యాలయం వద్ద సోమవారం బైటాయించారు. అనంతరం ఏవో పప్పల రమణమూర్తికి తమ సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు వర్కర్ల సంఘ నాయకులు జగదీష్, పాము గోవింద, వై.రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కన్నబాబు పుట్టినరోజు సందర్భంగా సత్యదేవుని సన్నిధిలో పూజలు



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కురసాల.కన్నబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి అప్పారావు, ధరా.రమణ, దడాల సతీష్, బొబ్బిలి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## స్పందన కార్యక్రమానికి 9 అర్జీలు



పెద్దాపురం : సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 9 అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో ఎస్.మల్లిబాబు తెలిపారు. వీటిలో ఆక్రమించుకున్న స్థలాన్ని తిరిగి ఇప్పించ వలసినదిగా మూడు ఆర్జీలు,వెబ్ ల్యాండ్ లో భూమి వివరాలు అప్డేట్ చేయమని ఒకటి,డూప్లికేట్ పట్టాదారు పాసు పుస్తకం ఇప్పించవలసినదిగా ఒకటి, స్థలాన్ని సర్వే చేయించమని రెండు, భూమి వివరాలు ఆన్లైన్ లో నమోదు చేయమని ఒకటి, ఫిర్యాదును ఎఫ్ఐఆర్ లో నమోదు చేయవలసినదిగా ఒకటి అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో తెలిపారు.

## దివ్యాంగుడు దాతృత్వం



అచ్యుతాపురం : దివ్యాంగులను ఆదుకునేందుకు సమాజంలో ప్రతి ఒక్కరు ముందుకు రావాలని శ్రీ స్వామి వివేకనంద దివ్యాంగుల అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగు నూకరాజు అన్నారు. సోమవారం ఆయన దివ్యాంగుడైన యజ్జల ఎర్రయ్యకు తన సొంత నిధులతో కృత్రిమ అవయవమును అందజేశారు. మండలంలో పూడిమడక శివారు కడపాలెం గ్రామనికి చెందిన యజ్జల ఎర్రయ్యకు ప్రమాదంలో కాలు పోవడంతో నడవలేక చాలా ఇబ్బందులు పడ డంతో కృత్రిమ కాలుకు తను సహాయం చేశానన్నారు. ఈ సంద ర్భంగా దివ్యాంగుడైన నూకరాజు మరొక దివ్యాంగుడుకు చేయూత నివ్వడం పట్ల సంఘ సభ్యులు, గ్రామ ప్రజలు అభినందించారు.

## పాతమల్లంపేట నుంచి కొత్తపాలెం వరకు రోడ్డు నిర్మించాలి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గొలుగొండ : పాతమల్లంపేట నుంచి కొత్తపాలెం వరకు లింక్ రోడ్డు నిర్మించాలని పాతమల్లంపేట మాజీ సర్పంచ్, వైసిపి సీనియర్ నాయకులు లెక్కల సత్యనారాయణ ఆధ్వర్యంలో కొత్తపాలెం గ్రామస్థులు సోమవారం స్పందన కార్యక్రమంలో గొలుగొండ తహశీల్దార్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన సూరకాసుల త్రిమూర్తులు, సూరకాసుల చిన్నమ్మలు ఇద్దరు రైతుల పొలంలోకి వెళ్లకుండా కంచె వేశారు. పాతమల్లంపేట నుండి కొత్తపాలెం రావడానికి ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా రోడ్డు వేశారు. కానీ పైన ఇద్దరు దీన్ని నిలిపివేశారు. రోడ్డు ఆగిపోవడంతో పొలంలో దమ్ము చేయుటకు, గానీ పొలం పనులకు వెళ్లేందుకు వీలు కాలేదన్నారు. పాతమల్లంపేట నుంచి కొత్తపాలెం రోడ్డు వేసిన యెడల కొత్తపాలెం, అచ్చయ్యపేట, అంటు మానుజర్లు, చంద్రపాలెం, బండుడుపాడు, పోలవరం గ్రామస్థులు పంచాయతీ కార్యాలయానికి గానీ, సచివాలయంకు గానీ వెళ్లేందుకు వీలు లేకుండా పోయిం దన్నారు.

కొంత మంది బండిబాట కోసం సొంత భూమి ఇచ్చారని, కానీ త్రిమూర్తులు, చిన్నమ్మలు స్థలం ఇవ్వలేదన్నారు. వీరు స్థలం ఇవ్వకపోవడం వలన రోడ్డు ఆగిపోయిందన్నారు. రోడ్డు నిర్మాణం జరగకపోవడం వల్ల రైతులకు పొలంలోనికి వెళ్లటానికి దారి చూపించ లేదన్నారు. దీంతో పండిన పంటను తెచ్చుకొనేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. కావున పైన తెలిపిన త్రిమూర్తులు, చిన్నమ్మలపై చట్టరీత్యా చర్యలు తీసుకొని పాతమల్లంపేట నుండి కొత్తపాలెంకు శాశ్వత రోడ్డు వేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పప్పల వెంకటరమణ, పోతిన లోవ, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## హింసాత్మక ఆందోళనలు దురదృష్టకరం

చెందిన వారైనా.. వారి హక్కులకు ఏరకంగానూ పౌరసత్వ చట్టం భంగం కలిగించబోదని ఆయన భరోసా ఇచ్చారు. పార్లమెంటు ఉభయ సభలు భారీ మెజారిటీతో పౌరసత్వ సవరణ చట్టాన్ని ఆమోదించారని, పెద్దసంఖ్యలో రాజకీయ పార్టీలు, ఎంపీలు దీనికి మద్దతుతెలిపారని, శతాబ్దాల చరిత్రగల భారతీయ సంప్రదాయ విలువలైన సామరస్యం, కరుణ, సౌభాతృత్వాలకు ఈ చట్టం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. సమాజంలో చీలిక తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న స్వార్థశక్తుల ప్రయత్నాలను ఓడించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు.

## హాట్‌హాట్‌గా అసెంబ్లీ సమావేశాలు

ఆరోపించారు. ఎస్సీలపై టీడీపీకి ఉన్న చిత్తశుద్ధి ఇదేనా అంటూ ప్రశ్నించారు. చంద్రబాబు కేబినెట్‌లో మంత్రి దళితుల్ని కించపరిచి మాట్లాడలేదా అని ప్రశ్నించారు జగన్. కనీసం చర్యలు కూడా తీసుకోలేదని మండిపడ్డారు. రాజకీయం కోసం కులాలను చీల్చేస్తారు.. అన్నదమ్ముల్ని చీల్చేస్తారని.. చివరికి పిల్లను ఇచ్చిన సొంత మామాకు కూడా వెన్నుపోటు పొడించారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేబినెట్‌లో 60శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చామని.. ఒక ఎస్టీ మహిళను డిప్యూటీ సీఎం, దళిత మహిళని హోంమంత్రిని చేసిన ఘనత తమదన్నారు జగన్. ఎస్సీ, ఎస్టీలల గురించి చర్చ జరుగుతుంటే ఆందోళన చేయడం దారుణమన్నారు. ఎస్సీ, ఎస్టీల కమిషన్‌ల కోసం బిల్లు తీసుకొస్తుంటే.. దిక్కుమాలిన రీతిలో, సిగ్గు లేకుండా బఫూన్లలా ప్రవర్తిస్తున్నారని.. ఇలాంటి వారిని సస్పెండ్ చేసినా తప్పు లేదన్నారు జగన్.

## దశల వారీ మద్యపాన నిషేధం

నుంచి విముక్తి లభించింది. చంద్రబాబు హయాంలో సరైన వర్షాలు పడలేదు. కృష్ణానదికి ఏనాడు వరద రాలేదు. రాష్ట్రంలో మాత్రం మద్యం ఏరులై పారింది. చంద్రబాబుది విజన్ 2020 కాదు...విజన్ 420. గత అయిదేళ్లలో రూ.75వేల కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. మరి చంద్రబాబుకు మద్యం అంటే అంత మక్కువ ఎందుకో అర్థం కావడం లేదు. మద్యం వల్ల పేదవాళ్ల జీవితాలు అల్లకల్లోలం అవుతున్నాయి. అన్నిటీకి అనర్థం మద్యమే. గత అయిదేళ్ల చంద్రబాబు పాలనలో మద్యం పాలసీతో కొన్ని లక్షల మంది కుటుంబాలు అన్యాయం అయిపోయాయి. అని మండిపడ్డారు. ఆరు నెలల్లోనే దశలవారీ మద్యపాన నిషేధాన్ని అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. 43వేల బెల్ట్ షాపులను తొలగించి, 40 శాతం బార్లు కూడా తగ్గించారు. గతంలో ఉన్న నాలుగువేలకు పైగా పర్మిట్ రూమ్‌లను తొలగించారు. ఇచ్చిన మాటను అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్. ఇన్నాళ్లు చరిత్రను విన్నాం, చదివాం. మొట్టమొదటిసారిగా సీఎం జగన్ పాలనలో చరిత్రను రాయడం చూస్తున్నాం.

మద్యపాన నిషేధంపై ముఖ్యమంత్రి నిర్ణయాన్ని ప్రతి మహిళా అభినందిస్తుంది. సీఎం జగన్ దేశంలో లేనివిధంగా పేదరికాన్ని శాశ్వతంగా రూపుమాపేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. ఇంటి యజమాని మద్యానికి బానిస అయితే ఆ ఇల్లు నరకమే. మద్యపాన నిషేధం అమలుపై... ఆదాయం కోల్పోతామని, అమలు చేయలేమని, మగవాళ్లు ఓట్లు వేయరంటూ చాలామంది మాట్లాడారు. అయితే ఆదాయం కాదు ...ఆడవాళ్ల సౌభాగ్యం ముఖ్యమని సీఎం జగన్ మద్యపాన నిషేధంపై కట్టుబడి ఉన్నారని ఎమ్మెల్యే రోజా పేర్కొన్నారు.

అన్ని అనర్థాలకు మద్యమే కారణం: భూమన

అంతకు ముందు ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ...అన్ని అనర్థాలకు మద్యమే కారణమని అన్నారు. జీవితాలను సర్వనాశనం చేసేది మద్యమే అని, మనుషులను మృగాలుగా మార్చే మహమ్మరి మద్యం అన్నారు. చంద్రబాబు హయంలో మద్యం విక్రయాలు పెరిగాయన్న భూమన మద్యం మానవ మనుగడకు ముప్పుగా మారిందని పేర్కొన్నారు.

## రాష్ట్రపతి రాక సందర్భంగా ఏర్పాట్లను పూర్తిచేయండి

అధికారులతో సీఎస్ జోషి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20న మధ్యాహ్నం ఒంటిగంటకు హకీంపేట విమానాశ్రయానికి రాష్ట్రపతి చేరుకుంటారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్‌లో తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పర్యటనకు సంబంధించి బందోబస్తు, ట్రాఫిక్, నిరంతర విద్యుత్‌సరఫరా, రోడ్ల మరమ్మతు, పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, అగ్నిమాపక నియంత్రణ వ్యవస్థ తదితర ఏర్పాట్లను పూర్తిచేయాలన్నారు. రాష్ట్రపతి నిలయంలో సీసీటీవీలు, మెడికల్ టీమ్‌లు, టెలిఫోన్, ఇంటర్‌నెట్ సౌకర్యం, పత్రికలు అందుబాటులో ఉండాలన్నారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి విధుల్లో ఉండే వివిధ శాఖల సిబ్బంది వివరాలను కంట్రోల్ రూంలో ఉండే ఇన్‌చార్జిల అధికారుల వివరాలను రెండు రోజుల్లో సమర్పించచకాలని సీఎస్ ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో కూడిన కంట్రోల్‌రూం అప్రమత్తంగా పనిచేయాలని అన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ రాష్ట్రపతి నిలయంలో బసచేస్తారని ఆయన తెలిపారు. ఈనెల 23న తిరువనంతపురం పర్యటనకు వెళ్తారని అన్నారు. ఈనెల 26న సాయంత్ర రాష్ట్రపతి హైదరాబాద్‌కు చేరుకుంటారని సీఎం వెల్లడించారు. ఈనెల 27న రాష్ట్రపతి నిలయంలో ఎట్‌హోం నిర్వహిస్తారని తెలిపారు. ఈనెల 28న మధ్యాహ్నం ఢీల్లీకి బయలు దేరి వెళ్తారని సీఎస్ జోషి పేర్కొన్నారు. ఈసందర్భంగా సమావేశంలో ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శి అయజ్‌మిశ్రా, జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్‌సిన్హా, వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి శాంతికుమారి, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేష్‌కుమార్, డిజిపి మహేందర్‌రెడ్డి, హోంశాఖ ముఖ్యకార్యదర్శి రవిగుప్త, పోలీస్ కమిషనర్లు అంజనీకుమార్, మహేశ్‌భగవత్, జీహెచ్‌ఎంసి కమిషనర్ లోకేష్‌కుమార్, జిల్లా కలెక్టర్లు మణిక్క రాజ్, ఎంవిరెడ్డి, హరీశ్, ప్రొటోకాల్ డైరెక్టర్ అర్వింందర్‌సింగ్, పోలీసు అధికారి ఎంకెసింగ్, కంటోన్మెంట్, జీహెచ్‌ఎంసి, సమాచారవాఖ, టీఎస్‌ఎస్‌పిడిసిఎల్, ఎయిర్‌పోర్ట్, మిలిటరీ తదితర శాఖల నుంచి అధికారులు పాల్గొన్నారు.

## తిరుమలలో సుప్రభాత సేవ రద్దు?

దాదాపు నెల పాటు వేంకటేశ్వర స్వామి తనను స్తుతించే సుప్రభాతం వినకుండానే నిద్ర లేచి భక్తులకు దర్శనం ఇవ్వాల్సి ఉంటుంది. మరి ఎందుకు అలా? ఏమిటి సంగతి? తిరుమలలో వేంకటేశ్వర స్వామి కైంకర్యాల కోసం ఓ ప్రత్యేక నియమావళి ఉంది. ఆ నియమావళి మేరకే అర్చకులు నడుచుకోవలసి ఉంటుంది. ఆరునూరైనా.. ప్రపంచం తలకిందులైనా సరే దానిని ఉల్లంఘించడానికి లేదు. నేటి నుంచి ధనుర్మాసం రానున్నది. దీనిని సాధారణ భాషలో శూన్య మాసం అంటారు. ఈ శూన్యమాసంలో తిరుమల వేంకటేశ్వర స్వామిని మేలుకొల్పే సుప్రభాత సేవను రద్దు చేస్తారు. అంటే వేకువ జాము నుంచి జనవరి 14 తేది వరకూ ఈ సేవ రద్దు అవుతుంది. ఈ నెల రోజులు కూడా వేంకటేశ్వర స్వామి సుప్రభాత సేవ లేకుండా నిద్ర లేవాల్సి ఉంటుంది. మరి సుప్రభాత సేవ స్థానంలో ఏం చేస్తారు? సహజంగా ఇది అందరికీ కలిగే సందేహం. వేంకటేశ్వర స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన వారిలో ఆళ్వార్లు ఒకరు. 12 మంది ఆళ్వారులలో ఒకరైన అండాల్ గోదాదేవి విరచిత తిరుప్పావై ఏకాంత సేవ నిర్వహిస్తారు. అండాల్ గోదాదేవి రచించిన పాసురాలను సేకరించారు. వాటిలో నెల రోజుల పాటు రోజుకు ఒకటి చొప్పున 30 వాటిని ఆలపిస్తారు. ధనుర్మాస వ్రతం అనేది తమిళులకు అత్యంత ముఖ్యమైనది. అందరికీ శుభం కలగాలని పాసురాలతో తిరుప్పావై సేవను నిర్వహిస్తారు. అలా సుప్రభాత సేవ స్థానంలో మరో సేవ జరుగుతుంది.

## జనవరి నుండిరైతు భరోసా కేంద్రాల ద్వారా సేవలు

చేయాలన్నారు. విశాఖ జిల్లాకు ఈ ఉత్సవ్ ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈవెంట్ అని దీని సక్సస్ కు అందరూ కృషిచేయాలన్నారు.

విశాఖ ఉత్సవ్ కు 5 లక్షలు:

విశాఖ ఉత్సవ్ నిర్వహణకు గంగవరం పోర్టు తరపున 5 లక్షల చెక్కును బి.బాలకృష్ణ,వైస్ ప్రెసిడెంట్ మరియు ఎల్.పి.యస్.రామునాయుడు, వైస్ ప్రెసిడెంట్, జిల్లా కలక్టరుకు అందజేశారు.

## పౌరసత్వ ప్రకంపనలు

పరిస్థితులు నన్ను తీవ్ర ఆవేదనకు గురిచేస్తున్నాయి. వర్సిటీ విద్యార్థుల ఆందోళన హింసాత్మకంగా మారడం దురదృష్టకరం. నిరసన పక్కదారి పట్టకుండా శాంతియుతంగా మెలగాల్సిన అవసరం ఉంది. శాంతిభద్రతలపై చర్చించేందుకు హోంమంత్రి అమిత్ షా సమావేశం కావాల్సిన అవసరం ఉంది అంటూ కేజ్రీవాల్ ట్విటర్ వేదికగా తెలిపారు. ఈ మేరకు అమిత్ షా అపాయింట్‌మెంట్‌ను కేజ్రీవాల్ కోరారు. కాగా జార్ఖండ్ ఎన్నికల ప్రచారం ప్రస్తుతం బిజీగా ఉన్న అమిత్ షా.. ఢిల్లీ వచ్చిన అనంతరం కేజ్రీవాల్‌తో భేటీ అయ్యే అవకాశం ఉంది. ఢిల్లీలో నెలకొన్న పరిస్థితులుపై ఇరువురు చర్చించనున్నారు. కాగా ఆగ్నేయ ఢిల్లీలోని జామియా మిలియా వర్సిటీలో ఆందోళనకారులు పలు బస్సులను తగలబెట్టడంతో హింసాత్మకంగా మారిన విషయం తెలిసిందే. మంటలను ఆర్పేందుకు వస్తున్న అగ్నిమాపక వాహనాలను కూడా విద్యార్థులు ధ్వంసం చేశారు. పోలీసుల లాఠీ చార్జిలో పలువురు విద్యార్థులు, ఆందోళనకారులకు గాయాలయ్యాయి. ఒక పోలీసుకు, ఇద్దరు అగ్నిమాపక సిబ్బందికి గాయాలయ్యాయి. కాగా, తాము శాంతియుతంగా నిరసన తెలుపుతున్నామని విద్యార్థి సంస్థ ఎన్ఎస్‌యూఐ తెలిపింది. కొన్ని సంఘ వ్యతిరేక శక్తులు ఉద్యమంలో చేరి హింసకు పాల్పడుతున్నాయని జామియా మిలియా వర్సిటీ విద్యార్థులు ఆరోపించారు. వర్సిటీలో ఉంటూ విద్యార్థులను రెచ్చగొడ్తున్న విద్యార్థేతరులను అదుపులోకి తీసుకునేందుకు ఆదివారం పోలీసులు జామియా మిలియా వర్సిటీలో సోదాలు జరిపారు.

## పౌరసత్వ సవరణ బిల్లును వ్యతిరేకించండి

### ఈ నెల 19న నిరసన కార్యక్రమాల్లో పాల్గొనండి

### సిపిఎం పిలుపు

విశాఖపట్నం: బిజెపి తెచ్చిన పౌరసత్వ సవరణ చట్టం ద్వారా భారత ప్రజలను మత ప్రాతిపదికన విభజించే దురుద్ధేశంతో చేసిందీ చట్టం. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదస్పద పౌరసత్వ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఈ నెల 19న దేశవ్యాప్తంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమాల్లో భాగంగా విశాఖ జిల్లాలో నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని ప్రజలకు, పార్టీ శ్రేణులకు సిపిఎం విశాఖ జిల్లా కమిటీ పిలుపునిస్తోంది. హిందూ రాష్ట్రంగా భారతదేశాన్ని తయారుచేయాలనే సామాజిక సమీకరణలు తనకు అనుకూలంగా చేసుకునే కుట్ర మాత్రమే. ఇది దేశ సమగ్రత, సమైక్యతలకు తీవ్ర ప్రమాదం. పౌరసత్వ సవరణ చట్టం ప్రకారం పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల నుండి హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్శీ, క్రిష్టియన్లు మతాలవారు 2014 డిసెంబర్ 31 నాటికి 5 సం॥లు ముందు వలస వచ్చినవారికి భారతదేశ పౌరసత్వం ఇవ్వబడుతుంది. వలస వచ్చిన ముస్లింలకు మాత్రం ఇవ్వబడదు. ఇలా పచ్చిగా వివక్ష చూపడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేకాదు ప్రజాస్వామ్య పునాదులను పెళ్ళగించడమే. త్యాగధనుల స్ఫూర్తితో ఆర్‌ఎస్‌ఎస్ - బిజెపి కుట్రలను తిప్పి కొట్టాలని వామపక్షాల ఆధ్వర్యంలో డిసెంబర్ 19న జిల్లా వ్యాప్తంగా జరిగే నిరసన కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరుతున్నాము.

## గీతం టేబుల్ టెన్నిస్ జట్టు ఎంపిక



సాగర్‌నగర్: 19 నుంచి 23వ తేదీ వరకు చెన్నైలోని హిందూస్తాన్ విశ్వవిద్యాలయంలో జరగనున్న దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల టేబుల్ టెన్నిస్ పోటీలలో పాల్గొని గీతం జట్టును ఎంపిక చేసినట్లు స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి డాక్టర్ కె. రామకృష్ణారావు తెలిపారు. జట్టు కెప్టెన్‌గా కె. సత్యశ్రీహరి వ్యవహరిస్తారని, సభ్యులుగా రోహిత్ అజయ్‌కుమార్, వి. కృష్ణ వివేక్, ఎన్ఎస్. గీతేందర్ రెడ్డి, అంకిత్ దేశపాండే ఎంపిక అయ్యారని కార్యదర్శి వెల్లడించారు. జట్టు మేనేజర్‌గా సహాయ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పి. జయలక్ష్మి వ్యవహరిస్తారని తెలిపారు. కాగా గీతం జట్టు తొలిపోటీగా బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయాల జట్టుతో తలపడుతుందన్నారు.

## జీవావరణాన్ని పరిరక్షించుకుందాం అందరి బాధ్యత

### జివియంసి అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ



విశాఖపట్నం: ప్రకృతితో మమేకమై పర్యావరణ హితంగా మనమంతా జీవించాలనే ఆలోచనతో పక్షులకూ, చిన్న చిన్న జీవులకు అవసరమైన, ఆహారాన్ని, నీటిని అందుబాటులో ఉంచేందుకు విద్యార్థులకు అవగాహన కలిగిస్తామని జివియంసి అదనపు కమిషనర్-2 ఆర్.సోమన్నారాయణ అన్నారు. కమిషనర్ వారి ఆదేశాల మేరకు సోమవారం ఉదయం స్పందన కార్యక్రమానికి ముందుగా జివియంసి కార్యాలయం వద్ద పక్షులకు నీరు, ఆహారం, పిచ్చుకల కోసం గూళ్ళు ఏ విధంగా ఏర్పాటు చేయాలన్న అంశాన్ని ప్రదర్శన ద్వారా ఏర్పాటు చేశారు. "మన జీవావరణాన్ని మనమే పరిరక్షించుకుందాం, మన నగరాన్ని స్వచ్ఛతకు మారు పేరుగా తీర్చిదిద్దుకుందాం" అనే నినాదంతో తలపెట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి విద్యా సంస్థనూ పచ్చని వాతావరణంతో ఉండేలా చూస్తామన్నారు. అనంతరం అదనపు కమిషనర్-3 డా.వి.సన్యాసిరావు మాట్లాడుతూ విడుదల చేసే వనంలా మార్చుకుందామన్నారు. భూ ఉపరితలం వేడెక్కిపోతున్న తరుణంలో మన నగరాన్ని పచ్చని చెట్లతో, పక్షుల కిలకిలారావాలతో ప్రాణవాయువుని విడుదల చేసే వనంలా మార్చుకుందామన్నారు. మనం క్రిమి కీటాకాల నివారణకు వాడే రసాయనాల వల్ల అదనంగా ప్లాస్టిక్ వ్యర్థాలు పెరుగుతున్నాయన్నారు. 147 జివియంసి స్కూలున్నాయని జోన్‌కు ఒక్క స్కూలు లో ఈ పక్షులకు పిచ్చుక గుళ్ళు, వైద్య వినియోగ మొక్కలను ఏర్పాటు చేస్తామన్నారు.

అనంతరం అదనపు కమిషనర్-1 ఎ.వి రమణి మాట్లాడుతూ ఇళ్ళలో మనం తినగా మిగిలిన ఆహార పదార్థాలనూ, పండ్లనూ ప్లాస్టిక్ కవరులో ఉంచి కవరుతో సహా బయట పారవేయవద్దన్నారు. ప్రతి ఒక్కరూ ఇతర జీవరాశి పట్ల కారుణ్యంతో జీవించేలా స్పందింపచేయాలన్నాదే జివియంసి ప్రదాన ఉద్దేశ్యం, పర్యావరణ పరిరక్షణకు, స్వచ్ఛ భారత్ విజయవంతం చేయడానికి అందరు పూర్తి స్థాయిలో కృషి చేయలన్నారు. జివియంసి ఆధ్వర్యంలో 171 పార్కులున్నాయని, ప్రతి పార్కులో ఈ పిచ్చుక గూళ్ళు, పక్కులకు త్రాగునీరు, ఆహారం ఏర్పాటు చేస్తున్నామని అక్కడ కాలనీ వాసులలో ఈ జీవుల పరిరక్షణకు అవగాహన పరుస్తున్నామని అన్నారు.

ఈ కార్యక్రమంలో సిసిపి విద్యుల్లత, సిఎంఓహెచ్ డా.కె.ఎస్.ఎల్.జి శాస్త్రి, ఎడిహెచ్ ఎమ్.దామోదర్, గ్రీన్ క్లైమేట్ ప్రతినిధి జె.వి.రత్నం, ఎ.ఎస్ రాజా కాలేజి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ వర్కర్ల వేతనాల బకాయిలు వెంటనే చెల్లించాలి

భీమునిపట్నం: పంచాయతీ వర్కర్ల వేతనాలు వెంటనే చెల్లించాలి,కనీస వేతనాలు అమలుచేయాలని ఎ.పి పంచాయతీ వర్కర్ల యూనియన్ గౌరవ అధ్యక్షులు రవ్వ నర్సింగరావు ఒక ప్రకటన ద్వారా డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజల ఆరోగ్యం, తమ ఆరోగ్యం గా భావించి మురుగు కాలువలు,రోడ్లు శుభ్రం చేస్తూ శుభ్రంగా ఉంచితే వారికి కనీసం వేతనాలు చెల్లించకపోవడం ధారుణమనీ చెప్పారు. చిప్పాడ పంచాయతీ లో ఆరుగురు కార్మికులు గత 20 రోజులుగా నిరసన తెలుపుతున్నా పట్టించుకోకుండా ఉండడం బాధాకరమని అన్నారు. కాలువలు నిండి కంపు కొడుతున్న పట్టించుకోకుండా ఉన్నట్లు తెలిపారు.పంచాయతీ లోనిధులు ఉన్నా గత ,5నెలలుగా జీతాలు లేవని అన్నారు. అన్ని నెలలు జీతాలు లేకపోతే వారు ఎలా బ్రతుకు తారనీ అన్నారు.ఇప్పటికైనా అధికారులు, సెక్రటరీ లు స్పందించి వెంటనే జీతాలు ఇవ్వాలనీ, పనిముట్లు,సేఫ్టీ పరికరాలు ఇవ్వాలని, కనీస వేతనాల జి.వో అమలు చేయాలనీ ప్రభుత్వం ను డిమాండ్ చేయాలని , లేని ఎడల ఆందోళన చేయనున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

## ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి



భీమునిపట్నం: పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం భీమిలి ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బీచ్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహమునకు పాలాభిషేకము మరియు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షు బోండా నరసింహ మూర్తి, పోలిశెట్టి రమణ మూర్తి , కట్టమూరి రామారావు, ఉసిరికిల సతీష్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు సబ్బి శెట్టి శ్రీనివాసరావు, బోండా బాలాజీ, పూసర్ల శ్రీనివాసరావు న్యాయవాది ము మ్మడిశెట్టి సునీల్, కట్టమూరి వెంకన్న బాబు , ఉసిరికిల ప్రతాప్, సంఘ సభ్యులు ఆయన ఆత్మ శాంతి కొరకు కొంత సేపు మౌనం పాటించి పొట్టి శ్రీరాములు అమర్ రహే జోహార్ జోహార్ పొట్టి శ్రీరాములు అని నినాదాలు చేసారు.

## జిల్లా జాయింట్ కలెక్టర్ -1ను కలిసిన జిల్లా వీఆర్వో గ్రామ రెవెన్యూ సంఘ అధ్యక్షులు



సబ్బవరం: జిల్లా జాయింట్ కలెక్టర్ -1 ఎమ్ వేణుగోపాలరెడ్డి ఐఏఎస్ సోమవారం బాధ్యతలు చేపట్టిన సందర్భంగా విశాఖజిల్లా గ్రామ రెవెన్యూ అధికార్ల సంఘం అధ్యక్షులు సబ్బవరపు త్రినాధరామకాసు, రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికార్ల సంఘం అధ్యక్షులు ఈర్లి శ్రీరామ్మూర్తి ఇరువురు విశాఖపట్నం కలెక్టర్ ఆఫీస్‌లో ఆయన ఛాంబర్‌కు వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఆయనను అభినందించారు.

ఈ సందర్భంగా వీఆర్వో గ్రామ రెవెన్యూ సంఘ అధ్యక్షులు ఎస్ త్రినాధ రామకాసు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై పక్కాగా దృష్టి సారించి తప్పని సరిగా అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని ఆయనను కోరారు.

## చిత్రలేఖన పోటీలు

భీమునిపట్నం : నేషనల్ కన్జర్వేషన్ వీక్ డిసెంబర్ 14 నుండి 20వ తేదీలో భాగంగా సోమవారం స్థానిక ఏఎంజి స్కూల్‌లో ఎనర్జీ కన్జర్వేషన్ మీద చిత్రలేఖన పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ జోన్-3 విశాఖపట్నం బి. సింహాచలం నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేశారు. మొదటి బహుమతి ఎస్ చందు , రెండవ బహుమతి ఎన్ .మైధిలి . మూడవ బహుమతి కే డానియల్, 4, 5, 6 బహుమతుల వరుసగా ఎస్. అరుణ, సిహెచ్. రమ్య, వై . గురు చందన . అనంతరం స్కూల్ విద్యార్థుల చేత 24 విద్యుత్ పొదుపు సూత్రాలను చదివించి వారికి అవగాహన కల్పించారు. భీమిలి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో ఏ ఎం జి స్కూల్ ప్రిన్సిపాల్ కే శ్రీనివాస్ , భీమిలి అసిస్టెంట్ ఇంజనీర్ పి. కాశి బాబు , తగరపు లస అసిస్టెంట్ ఇంజనీర్ ఎన్.వి.రమణ , పద్మనాభం మండలం అసిస్టెంట్ ఇంజనీర్ ఏ . జగన్ మోహన్ రావు మరియు భీమిలి సబ్ డివిజన్ విద్యుత్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## డయల్ యువర్ కమిషనర్‌కు 23 ఫిర్యాదులు

విశాఖపట్నం: జి.వి.యం.సి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ (నెంబరు 1800-4250-0009) కార్యక్రమానికి 23 ఫిర్యాదులు అందాయి.

జివియంసి ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వై.మంగపతిరావు డయల్ యువర్ కమిషనర్ కార్యక్ర మానికి హాజరై పలువురి నుండి వచ్చిన ఫోన్ కాల్స్‌కు సమా ధానం చెప్పారు.

ఇందులో ఒకటవ జోన్‌కు సంబంధించి 5, రెండవ జోన్‌కు-3 , మూడవ జోన్‌కు-2, నాలుగవ జోన్‌కు-3, ఐదవ జోన్‌కు-4, ఆరవ జోన్‌కు -4, ప్రాజెక్టు డైరక్టర్ (యుసిడి) విభాగానికి సంబంధించి 2 ఫిర్యాదులు అందాయి. సంబంధిత అధికారులు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి మూడురోజులులోగా నివేదిక సమర్పించాలని కోరారు.

## ఉచిత హోమియో వైద్య శిబిరం



భీమునిపట్నం : స్థానిక చిన్నబజార్ లో ఉన్న కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 200 మంది రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు ఇవ్వడం జరిగిందని ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీ రామ చంద్రమూర్తి తెలియజేశారు.వైద్య శిబిరం నందు డాక్టర్లు టి. జగన్నాథ రావు, టి. మోహనరావు వైద్యులను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో కలిగొట్ల భానోజిరావు, శ్రీనివాసరావు, కె. చంద్రశేఖర్ రావు, ఎం. శంకర్, రాంబాబు, లక్ష్మణరావు ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## స్పందన ఫిర్యాదులకు ప్రథమ ప్రాధాన్యతనివ్వండి

### జివియంసి స్పందనకు 188 పిర్యాదులు .. జివిఎంసి కమిషనర్ డా.జి.సృజన



విశాఖపట్నం: స్పందనలో నమోదైన ఫిర్యాదుదారులను సంద ర్శించి ఎన్ని రోజులలో పరిష్కరిస్తారన్నది తెలియజేయాలని జివియంసి కమిషనర్ డా.జి.సృజన పేర్కొన్నారు. అదేవిధంగా ఫిర్యాదు పరిష్కారం అయిన తరువాత ఆ విషయాన్ని ఫిర్యాదు దారుకు తెలియజేయడంతోబాటు స్పందన రిజిష్టర్‌లో నమోదు చేయాలని వివరించారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మొత్తం 188 ఫిర్యాదులు అందాయి. జివియంసి అదనపు కమిషనర్ ఎ.వి.రమణి ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరిస్తూ వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పిర్యాదులలో ప్రధాన కార్యాలయానికి సంబంధించి 86, ఒకటవ జోన్‌కు సంబంధించి 15, నాలుగవ జోన్‌కు సంబంధించి 11 , ఐదవ జోన్‌కు సంబంధించి 67, ఆరవ జోన్‌కు సంబంధించి 9 ఫిర్యాదులందాయి. వీటిలో టౌన్‌ప్లానింగ్ విభాగంకు సంబంధించి 27, ప్రజారోగ్యవిభాగానికి సంబంధించి 13, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 32, హార్టికల్చర్ విభాగానికి సంబంధించి మూడు, డిప్యూటి కమిషనర్ రెవిన్యూ విభాగంకు 23, యుసిడి విభాగానికి సంబంధించి 21, జె.డి మరియు ఎఫ్ఎ అండ్ ఎఓ (ఎఫ్ఎసి) కు సంబంధించి ఎనిమిది, ఇతరులకు సంబంధించి 61 పిర్యాదులు అందాయి.

## లారీ బోల్తా స్తంభించిన ట్రాఫిక్



కంచరపాలెం: ఎన్ .ఏడీ కూడలి వద్ద పెద్ద ప్రమాదమే తప్పింది. వెస్ట్ బెంగాల్ నుండి అమలాపురం వెళుతున్న లారీ స్టాపర్ స్ ను తప్పించ బోయి అదుపు తప్పి ఎన్ఎడి జంక్షన్ ఫ్లైఓవర్ కకాని నగర్ వద్ద సోమవారం అర్థ రాత్రి బోల్తా పడింది.

ఈ మేరకు ట్రాఫిక్ స్తంభించడంతో అటుగా వెళ్లే విద్యార్థులు , ఉద్యోగస్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొ న్నారు. ప్రమాద సమయంలో లారీ లో తీసుకు వెళ్తున్న చేపలకు పశువులకు మేత బస్తాలు లోడు ఒక్కసారిగా అదుపుతప్పి రహదారిపై జారి పడిపోవడంతో ఒక్కసారిగా ట్రాఫిక్ స్తంభించింది .ఈ మేరకు కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ కృష్ణ పరిస్థితిని సమీక్షించి భారీ క్రేన్ సాయంతో లారీని రోడ్డు మీద పడిన బస్తాలను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

## మర్రిపాలెం ప్రధాన రహదారిపై ఆటో బోల్తా



కంచరపాలెం: మర్రిపాలెం 104 కూడలి ప్రధాన రహదారి పై సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఆటో బోల్తా పడింది. ప్రమాదానికి సంబందించి స్థానికుల వివరాల మేరకు ఎన్ .ఏడీ కూడలి నుండి కంచరపాలెం వైపుగా వెళ్తున్న ఆటో మర్రిపాలెం 104 కూడలి ప్రధాన రహదారి పై అటుగా బి.అర్ .టి .ఎస్ రహదారి ని అధిగమిస్తున్న ద్విచక్ర వాహన దారుడిని తప్పించేక్రమంలో ఒక్క సారిగా ఆటో బోల్తా పడింది ఈప్రమాదంలో ఆటో ప్రయాణిస్తున్న వృధునికి స్వల్పగాయాలు కాగ స్థానికులు అతడికి సపరియలు చేసారు. విషయం తెలుసుకున్న కంచరపాలెం ట్రాఫిక్ పోలీసు లు ప్రమాదానికి సంబందించి వివరాలు సేకరించారు.

## వార్డుల్లో మౌలిక వసతులు కల్పించండి

### బిజేపి వార్డు అధ్యక్షుడు కాళ్ళ ఆదిబాబు



కంచరపాలెం: వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని కోరుతూ జీవీఎంసీ 40 వ వార్డు బిజేపి వార్డు అధ్యక్షుడు కాళ్ళ ఆదిబాబు కోరారు. ఈమేరకు జోనల్ కార్యలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జీవీఎంసీ జోన్ -4 కమిషనర్ పి.సింహచలం వార్డు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు . గతంలో 40 వ వార్డు పరిది జ్యోతి నగర్ వద్ద దోబికాన నిర్మాణ పనులకు సంబందించి శంకుస్థాపన జరిగి ఏళ్ళు గడిస్తున్న ఇప్పటికి పనులు పూర్తి చేయలేదని , అలాగే గ్రీన్ గార్డెన్స్ వద్ద బి .టి రోడ్లు నిర్మాణ పనులు చేపట్టాల్సి వుందన్నారు.

అదేవిదంగా ఆర్ .అండ్ .బి కూడలి వద్ద నున్న హిందు స్మశాన వాటికలో గత ప్రభుత్వ హయాంలో 25 లక్షలు వ్యచించి స్మశాన వాటిక ఆధునీకరణ పనులు చేపట్టారని అందులో బాగంగా మృతులకు కననం చేసేందుకు రేకుల షెడ్ నిర్మించారని అయితే సదరు రేకుల షెడ్ లో బర్కింగ్ ఫ్లాట్ ఫామ్ ఏర్పాటు చేయాల్సి వుందన్నారు. వార్డులో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని జోన్ -4 కమిషనర్ పి.సింహచలం హమీ ఇచ్చారు.

కార్యక్రమంలో బిజేపి వార్డు ప్రధాన కార్యదర్శులు బి.గోపాల్ , ఎస్ .వి.రామరావు తదితరులు పాల్గున్నారు.

## సమాజంలో కుల సంఘాల ఆవశ్యకత ఎంతో ఉంది

### మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి

సబ్బవరం: కులాల వారీగా ప్రభుత్వం కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో కుల సంఘాల ఆవశ్యకత ఎంతో ఉందని మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి అన్నారు. మండలంలోని పెదనాయుడు పాలెం సమీపంలో శ్రీ నూకాంబిక దేవాలయం ఆవరణలో నవ చైతన్య తాంధ్ర పాపారాయుడు వెలమ సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గండి బాబ్జి మాట్లాడుతూ వెలమలు అన్ని రంగాల్లో ఉన్నతిని సాధించాలని అన్నారు. ఇటువంటి సమావేశాలు రాజకీయంగా అభివృద్ధి సాధించేందుకు దోహద పడతాయని అన్నారు. రాజకీయాలను ప్రక్కన పెట్టి ఎవరు అధికారంలో ఉన్నా కులాన్ని సంఘటితం చేసుకునేందుకు కృషి చేయాలని కోరారు. గత ప్రభుత్వం వెలమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని, దీని ద్వారా విదేశాల్లో ఉన్నత చదువులకు 2 లక్షల వరకూ కేటాయించేదని అయితే ప్రస్తుత ప్రభుత్వం దీనిపై ఇంకా స్పష్టత ఇవ్వలేదని అన్నారు. గ్రామస్థాయిలో కమీటీలు వేసి అనంతరం జిల్లా కమిటీలు వేసినప్పుడు సంఘాలు మరింత పటిష్టంగా ఉంటాయని అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన వైఎస్సార్ సిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు, మాజీ జెడ్పిటిసి కొటాన రాము మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా వెలమలకు అన్ని రకాల సహకారం అందేలా కృషి చేస్తామని అన్నారు. చొక్కాకుల వెంకట్రావు మాట్లాడుతూ సంఘానికి తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో మండల సముద్రం, మిడతాడ మహలక్ష్మినాయుడు, బొకం రామునాయుడు, కొటాన కోటయ్య, గండి దేముడు, ధనిమిరెడ్డి శ్రీనువాసరావు, కొటాన అప్పారావు, తమరాన బంగారు నాయుడు, బోని గంగునాయుడు, బర్ల రమణ, రెడ్డి దేముడు, వనం సత్యనారాయణ, వనం దేముడు, గొంప ముత్యాలనాయుడు, సబ్బవరపు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


**ఉత్తర రైల్వే**

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతి ద్వారా టెండరు ప్రకటన**

ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్స్ మేనేజర్, ఉత్తర రైల్వే న్యూఢిల్లీ-110001 వారు ఇ-ప్రొక్యూర్‌మెంట్ విధానంపై భారతరాష్ట్రపతి తరపున దిగువ ఐటమ్‌ల సరఫరా కొరకు టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

| క్ర.సం | టెండరు నెం. | సంక్షిప్త వివరణ | పరిమాణం | గడువు తేది |
|---|---|---|---|---|
| 01 | 07191891 | చేనేత గల దూది పరుపు తెల్లగా పాలిపోవడం చేయుట | 392 సెట్లు | 31.12.2019 |

గమనిక : 1. అమ్మకందారులు పూర్తి వివరాలను ఐఆర్ఇపిఎస్ సైట్ www.ireps.gov.in లో డౌన్ లోడ్ చేసుకొనవచ్చును. 2. మాన్యువల్ ఆఫర్లు అంగీకరించబడవు

టెండరు ప్రకటన నెం. 18/2019-2020 తేది: 06.12.2019 **4004/2019**

వినియోగదారులకు చిరునవ్వుతో సేవలు

# విజయభాను సంపాదకీయం

## చారిత్రక మానవీయ పరిణామం

మానవీయ స్వభావాన్ని మత వివక్షగా చిత్రీకరించడానికి జరుగుతున్న ప్రయత్నం పౌరసత్వ సవరణ ప్రతిపాదన-సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ బిల్- సీఏబీ-ను వ్యతిరేకిస్తున్నవారు చెబుతున్న వికృత భాష్యం! ఈ వ్యతిరేకులు దేశంలో ఉన్నారు, విదేశాలలో ఉన్నారు. ఈ బిల్లును వ్యతిరేకిస్తున్న అంతర్గత విరోధులు ప్రభుత్వాన్ని, దేశాన్ని అంతర్జాతీయ సమాజంలో అప్రతిష్ఠపాలు చేస్తున్నారు. ఈ వ్యతిరేకుల ఆర్భాటాన్ని అందిపుచ్చుకున్న విదేశాల ప్రభుత్వాలు కొన్ని మన దేశంలో మతపరమైన వివక్షకు పౌరసత్వ సవరణ ప్రతిపాదన దోహదం చేస్తోందన్న వక్రభాష్యాలు పలుకుతున్నారు. పాకిస్తాన్‌లోను, అఫ్ఘానిస్థాన్‌లోను, బంగ్లాదేశ్‌లోను అత్యధిక శాతం ప్రజలు ఇస్లాం మతస్థులు. ఇస్లాం మతస్థులు అధికాధికంగా ఉండే దాదాపు ప్రతి దేశంలోను జిహాదీలు చెలరేగడం, ఈ జిహాదీలు ఇస్లామేతర మతాల వారిని నిర్మూలిస్తుండడం నడుస్తున్న చరిత్ర! ఈ మూడు దేశాలలో కూడ ఇస్లాం మతస్థులు అత్యధికంగా ఉన్నారు. అందువల్ల దశాబ్దులపాటు ఇస్లామేతర మతస్థులను జిహాదీలు హత్యచేశారు, మతం మార్చారు, లైంగిక బీభత్సకాండకు గురిచేశారు, తరిమివేశారు. ఇలా తరిమివేతకు గురి అయిన ఇస్లామేతర మతాలవారు మన దేశంలో తలదాచుకుంటున్నారు. ఏళ్లతరబడి శరణార్థులుగా పడిఉన్న ఈ ఇస్లామేతర మతాల వారికి భారతీయ పౌరసత్వం ప్రసాదించడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం పౌరసత్వ సవరణ ప్రతిపాదనను రూపొందించింది. ఈ బిల్లును పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించడం అందువల్ల చారిత్రక మానవీయ పరిణామం. ఇలా బిల్లుకు ఆమోదం లభించడం పట్ల హృదయం ఉన్న, మానవీయ స్వభావం ఉన్న ప్రతి ఒక్కరు హర్షం ప్రకటిస్తున్నారు. జిహాదీల భయంకర బీభత్సకాండ నుంచి తప్పించుకొని పారిపోయి వచ్చిన నిస్సహాయులకు భారతీయ పౌరసత్వం ఇవ్వరాదనడం రాక్షసత్వం! బిల్లును వ్యతిరేకించిన వారిని బహుశా ఈ రాక్షసత్వం ఆవహించింది! ఈ మూడు దేశాలలోను ముస్లింలు జిహాదీల బీభత్సకాండకు బలి కాలేదు. ఇస్లాంను తప్ప మిగిలిన మతాలను నిర్మూలించడం లక్ష్యమైన జిహాదీలు సహజంగానే ఇస్లాం మతస్థులను వేధించరు, వేధించలేదు. అందువల్ల ఈ మూడు దేశాలలో ఇస్లాం మతస్థులు హింసకు గురికాలేదు, అందువల్ల ఇస్లాం మతస్థులు శరణార్థులై ఈ మూడు దేశాల నుంచి పారిపోలేదు, మన దేశంలో తలదాచుకోలేదు. అందువల్ల మత హింసకు, మతోన్మాద బీభత్సకాండకు బలైన శరణార్థులలో ఇస్లాం మతస్థులు లేరు. అందువల్ల శరణార్థులకు పౌరసత్వం కల్పించే ఈ బిల్లు పరిధిలో ఇస్లాం మతస్థులు లేకపోవడం సహజమైన పరిణామం! అందువల్ల బిల్లు పరిధిలో ఇస్లాం మతాన్ని ఎందుకు చేర్చలేదని అడుగుతున్నవారు వాస్తవ సూర్యకాంతిని చూడనంటున్న గుడ్లగూబలు! శరణార్థులలో ఇస్లాం మతస్థులు లేనప్పుడు, లేనివారికి ఈ బిల్లువల్ల భారతీయ పౌరసత్వాన్ని ఎలా కల్పిస్తారు?

ఈ మూడు దేశాలలోను భయంకర హింసలకు గురైై మన దేశానికి వచ్చిన శరణార్థులందరూ ఇస్లాం మతేతరులు! అందువల్ల ఇస్లాం మతేతర శరణార్థులకు పౌరసత్వం కల్పించడం ఇస్లాం మతం పట్ల వివక్ష కాజాలదన్నది విచక్షణ జ్ఞానం ఉన్నవారు గ్రహించిన వాస్తవం! క్షతగాత్రులకు చికిత్స చేయడం మానవీయ దృక్పథం, కేంద్ర ప్రభుత్వం ఇలా క్షతగాత్రులకు చికిత్స చేసింది. కాబ్‌ద్వారా ఈ చారిత్రక క్షతగాత్రులకు శరణార్థులకు మన దేశపు పౌరసత్వం మళ్లీ కల్పించింది! అందువల్ల క్షతగాత్రులు కానివారికి కూడా ఎందుకు చికిత్స చేయరు..? ఇది వివక్ష కాదా?? అని ప్రశ్నిస్తున్న వారి బుద్ధిని ఏమని పిలవాలి?? గాయపడని-పాకిస్తాన్‌లోను, అఫ్ఘానిస్థాన్‌లోను, బంగ్లాదేశ్‌లోను అసలు గాయపడని- వారికి చికిత్స ఎందుకు?? చికిత్స జరిగి తీరాలని-గాయపడని వారికి సైతం గాయపడిన వారితో సమానంగా చికిత్స జరిగి తీరాలని- బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా పార్లమెంటు సభలలోను, బయట కూడ వాదించిన వారిని ఏమనాలి?? అనభిజ్ఞులని అనాలా? దుర్బుద్ధితో భారతీయుల మధ్య, ఒకే జాతీయుల మధ్య మతం పేరుతో విభజన కల్పించిన బ్రిటన్‌వారి వారసులనాలా?? సర్వ మత సమానభావ, సర్వమత సమ్మాన సామాజిక వ్యవస్థ అనాదిగా అఖండ భారత్‌లో కొనసాగింది, యుగాలుగా వికసించింది. ఈ అఖండ భారత్ వివిధ సమయాలలో విభజనకు గురి అయింది. కలియుగం 5049-క్రీస్తుశకం 1947-లో జరిగిన చివరి విభజన తరువాత అవశేష భారత్‌లో ఈ సర్వమత సమభావ, సర్వమత సమ్మాన వ్యవస్థ యథాపూర్వంగా కొనసాగుతోంది. అందువల్ల అవశేష భారత్ అయిన మన దేశంలో అల్పసంఖ్య మతస్థులు వివక్షకు గురికావడం లేదు, బీభత్సకాండకు బలికావడం లేదు, దేశం వదలి పారిపోవడం లేదు!! అధిక సంఖ్యాకుల కంటె అధికంగా అల్పసంఖ్య మతాలవారికి మన దేశంలో ఆదరణ లభిస్తోంది! ఇది సూర్యుని వెలుగు వంటి వాస్తవం. లభించడం లేదని చిత్రింప యత్నిస్తున్నవారు మతాల మధ్య చిచ్చుపెడుతున్నారు.

## జనవరి 1వ తేదీ నుండి
## వార్డు/గ్రామ సచివాలయాల ప్రక్రియను ప్రారంభించాలి

**డి.మురళీధర్ రెడ్డి**

పెద్దాపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల వద్దకే సంక్షేమ పథకాలను అందించే ఉద్దేశంతో గ్రామ సచివాలయాల ఏర్పాటు, ఉద్యోగ నియామకాలు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డి. మురళీధర్ రెడ్డి తెలిపారు. గురువారం డివిజన్లోని పెద్దాపురం పట్టణంలోని వార్డు సచివాలయాలను, మండలంలోని తాటిపర్తి,తిరుపతి గ్రామ సచివాలయాలను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా తిరుపతి గ్రామ సచివాలయంలో సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లతో సమావేశమయ్యారు.ఈ సమావేశంలో సంబంధిత అధికారులు,సిబ్బంది, వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతూ వచ్చే జనవరి 1 తేదీ నుండి రేషన్, పింఛన్లు,తదితర సేవలు అన్నియు గ్రామ వాలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు అందించడానికి సమాయత్తం అవ్వాలని ఆదేశించారు. గ్రామంలో ఉన్న ప్రజలకు ప్రభుత్వపరంగా సమస్యలు ఉంటే ఇకపై గ్రామ సచివాలయ ఉద్యోగులే బాధ్యత తీసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది,వాలంటీర్లు శిక్షణ తరగతులలో పొందిన శిక్షణ ప్రకారం ప్రజలకు సేవలు అందించాలన్నారు.గ్రామ సచివాలయం పూర్తి భాద్యత పంచాయతీ సెక్రటరీలదేనని,ఏ కారణం చేతనైనా సెక్రటరీ సెలవు పెడితే డిజిటల్ అసిస్టెంట్ బాధ్యత తీసుకోవాలని అన్నారు. సచివాలయలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది, వాలంటీర్లకు సమాచార గ్రూపును ఏర్పాటు గురించి ఈ సమావేశంలో అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా జిల్లా అధికారుల గ్రూపును కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు. సచివా లయానికి సంబంధించిన ఇంటర్నెట్, స్టేషనరీ, ఎలక్ట్రిసిటీ తదితర అంశాలపై కలెక్టర్ సంబంధిత ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, సచివాలయ ఉద్యోగులను అడిగి తెలుసు కున్నారు. అనంతరం గ్రామ సచివాలయ భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు.ఈ కార్యక్రమానికి ముందు పెద్దాపురం పట్టణంలో రైతు బజార్ పక్కన ఉన్న మహాత్మా గాంధీ మున్సిపల్ స్కూల్ ఆవరణలో ఏర్పాటుచేసిన వార్డు సచివాలయాన్ని,అలాగే గోలి కృష్ణారావు మున్సిపల్ స్కూల్లో ఏర్పాటు చేసిన వార్డు సచివాలయాన్ని కలెక్టర్ పరిశీలించి, వాలంటీర్లను వారు చేసిన సర్వే పై ఆరా తీశారు. అదేవిధంగా అక్కడ ఉన్న సచివాలయ సిబ్బందిని కూడా ప్రస్తుతం వారు చేస్తున్న విధులను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి ఎస్.మల్లిబాబు, డివిజినల్ పంచాయతీ అధికారి నరసింహారావు,మున్సిపల్ కమిషనర్ జి.శేఖర్,తహసీల్దార్ కె.పద్మావతి,మున్సిపల్ మేనేజర్ నాగేశ్వరరావు,ఎంపీడీవో ఎ.రమణారెడ్డి,ఈవోపీఆర్డీ కె.హిమ మహేశ్వరి,తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర స్థాయి భగవద్గీత పోటీలకు వివేకానంద విద్యార్థుల ఎంపిక

అనకాపల్లి: విశాఖపట్నంలోజరిగిన చిన్మయా మిషన్ వారు నిర్వహించిన జిల్లాస్థాయి భగవద్గీత పోటీలలో కశింకోటకు చెందిన వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. 9 వ తరగతి చదువుతున్న విద్యార్థిని జి .పావని కి ద్వితీయ స్థానం లభించగా జూనియర్ విభాగంలో 4 వ తరగతి చదువుతున్న పి. రిషికేష్‌కు తృతీయ స్థానం మరియు 1 వ తరగతి చదువుతున్న విద్యార్థి కె . రేవంత్ సాయి కి ద్వితీయస్థానం పొందారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ మళ్ళ జగదీష్ మాట్లాడుతూ భగవద్గీత పట్ల పిల్లలకు ఇంకా మంచి శిక్షణ ఇప్పించి రాష్టస్థాయిలో కూడా గుర్తింపు తెస్తామని చెప్పారు.



ఈ విద్యార్థులని కరస్పాండెంట్ మళ్ళ జగదీశ్ ,ప్రిన్సిపాల్, మళ్ళ శైలజ ,తిరుపతిరావు అభినందనలు తెలియచేసారు

## లేనిపోని ఆరోపణలు చేస్తున్న వైసీపీ నాయకులు



అనకాపల్లి: వైసీపీ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని లేని పోని ఆరోపణలు చేస్తున్నారని తెలుగుదేశంపార్టీ నాయకులు మళ్ల సురేంద్ర ఆరోపించారు. ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేసారు. లేని పోని ఆరోపణలు చేయాల్సి అవసరం తెలుగుదేశంపార్టీకి లేదన్నారు. గత ప్రబుత్వంలో ఎంత అభివృద్ధి జరిగిందో ప్రజలకు తెలుసన్నారు. కళ్యాణ మండపాలు షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించిన ఘనత టీడీపీదే దనన్నారు. వాటికి రంగులు వేసుకోవడం తప్ప ఒక్క పనికూడా వైసీపీ ఆరునెలల్లో చేయలేదన్నారు. అన్నా క్యాంటిన్లు మూయించారని విమర్శించారు. మారు మూల ప్రాంతాలలో రోడ్లు వేయించిన ఘనత టీడీపీదే అన్నారు. డ్రైనేజీలు సులాబ్ కాంప్లెక్స్‌లు, బస్టాప్‌లు, ఆసుపత్రి అభివృద్ధి ముఖ్యమంత్రి సహాయ నిధి పంపిణీ, పేదవారికి ఫింఛన్లు, మహిళల కుట్టుమిషన్లు, పిల్లలకు క్రీడా సామాన్లు రైతులకు సబ్సిడీలు ఇచ్చిన ఘనత టీడీపీదే అన్నారు. నూకాంబిక ఆలయ అభివృద్ధి తెలుగుదేశంపార్టీకి దక్కుతుందన్నారు. రాజగోపుర నిర్మాణం జరిగింధన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు టీడీపీలా చేయాలి తప్ప నిందలు వేయడం తగదన్నారు. ఇప్పటికైనా అభివృద్ధి పై దృష్టి సారించాలని వైసీపీ నాయకులు సూచించారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి
## ఎంపీ గీతకు వినతి

కాకినాడ: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కాకినాడ చిన్న మద్య తరగతి పత్రికల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాయవరపు ప్రభాకర్ ఆధ్వర్యంలో కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాధ్‌కు వినతిపత్రం అందజేసారు. కాకినాడ నగర శాసన సభ్యులు ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి కార్యాల యానికి విచ్చేసిన ఎంపీ వంగాగీతా విశ్వనాథ్ కలసి, జర్నలిస్టుల పలుసమస్యలను వివరించి వినతిపత్రం అందించారు.జాతీయ రహదారులపై ఏర్పాటు చేసిన టోల్ గేట్ల వద్ద అక్రిడిటేషన్ జర్నలిస్టుల వాహనాలకు టోల్ రుసుం నుండి మినహాయింపు, రైల్వే పాస్ కలిగిన జర్నలిస్టుల దూర ప్రయాణంలో అత్యవసర కోటా క్రింద కన్‌ఫార్మ్ టిక్కెట్లు ఏర్పాటు కోసం విన్నవించడం జరిగింది. దీనిపై ఎంపీ గీత సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు సత్యంబాబు, ఆంధ్రభూమి రాజు ,గుండు శ్రీనివాస్, బిరుదుగడ్డ సుకుమార్, స్వామి,రమేష్‌బాబు, కోనచిన్ని,జ్యోతిశ్రీ ,కెసిసి శ్రీను,శ్రీవారి తదితరులు పాల్గొన్నారు.

## కవి సమయం

### కష్ట నష్టాలు

కష్ట నష్టాలెదురైనప్పుడు
నిరాశా నిస్పృహల్లో కొట్టుమిట్టాడడం
వైరాగ్య ధోరణి నవలంబించడం అవివేకం
సమస్యల సుడి గుండం నుండి
బయట పడేందుకు ఆశావహ ధృక్పధం తో ,
ఆత్మ విశ్వాసాన్ని కూడ గట్టుకొని
ముందడుగు వేస్తే విజయ ప్రాప్తం తథ్యం
ఎంతవారలకైనా కష్టాలు అనివార్యం
కష్టాలెదురవని జీవితం ఉప్పులేని కూర వంటిది
కష్టాలను చిరునవ్వుతో భరించే
సహన శక్తి అలవర్చుకోవడం అత్యావశ్యకం
జీవితమంతా కష్టాలెదురైనా
వాటినధిగమించి విజయం సాధించిన
హరిశ్చంద్రుడు, గౌతమ బుద్ధుడు వంటి
మహనీయులు మనకు స్ఫూర్తిదాయకం

...రచయిత
సి.ప్రతాప్

## పంచాంగం

మాసం : మార్గశిర; తిథి : షష్ఠి రా.2.50; మఘ తె.3.09; వ.వ.3.51ల 5.22.

మంగళవారం 17-12-2019

a **మేషం** : కోర్టు వ్యవహారాలలో ప్లీడర్లు చికాకులను ఎదుర్కొంటారు. ప్రభుత్వ సంస్థలలోనివారు మార్పులకై చేయు ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఉద్యోగస్తులకు సమస్యలు తలెత్తినా తెలివితేటలతో పరిష్కరించగలుగుతారు. మీ సంతానం, పెద్దల ఆరోగ్యంలో మెలకువ అవసరం. ఐరన్, సిమెంట్, కలప, వ్యాపారస్తులకు అనుకూలం. b **వృషభం** : ఏజెంట్లకు, బ్రోకర్లకు, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులకు మిశ్రమ ఫలితం. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. గత స్మృతులు జ్ఞప్తికి వస్తాయి. బ్యాంకింగ్ అధికారులతో సంభాషించేటప్పుడు జాగ్రత్త వహించండి. ఉద్యోగస్తులు అధికారులతో సంభాషించేటప్పుడు మెలకువ అవసరం. నూతన వ్యాపారాలకు శ్రీకారం చుట్టగలరు. c **మిథునం** : కోర్టు వ్యవహారాలలో చికాకులను ఎదు ర్కొంటారు. నూతనంగా పరిచయమైన వ్యక్తులపట్ల మెలకువ అవసరం. దంపతుల మధ్య కలహాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. వృత్తి, ఉద్యోగాలందు ఉన్నవారికి ఆదాయం బాగుంటుంది. మీ ప్రియతముల పట్ల, ముఖ్యులపట్ల శ్రద్ధ పెరుగుతుంది. d **కర్కాటకం** : రాజకీయాలలోని వారు ఆచి తూచి వ్యవహరించాల్సి ఉంటుంది. వాహనాలు, విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలు సంభవం. కష్ట సమయంలో బంధువులు అండగా నిలుస్తారు. ప్రముఖులతో చర్చలు జరపుతారు. స్త్రీలు అపరిచిత వ్యక్తులపట్ల మెలకువ అవసరం. ఆలయాలను సందర్శిస్తారు. e **సింహం** : ఉద్యోగస్తులకు బాధ్యతలు అధికం అవుతాయి. రావలసిన ధనం కొంత ముందు వెనుకలుగానైనా అందుతుంది. వాహనం ఇతరులకు ఇచ్చి ఇబ్బందులను ఎదుర్కొంటారు. సంఘంలో మీ కీర్తి, ప్రతిష్టలు ఇనుమడిస్తాయని చెప్పవచ్చు. వైద్యులకు మెలకువ అవసరం. బంధుమిత్రుల రాకపోకలు పెరుగుతాయి. f **కన్య** : కాంట్రాక్టర్లకు సదవకాశాలు లభించినా ఆర్థిక ఒత్తిడి ఎదుర్కొనక తప్పదు. మీ సంతానం మొండి వైఖరి మీకు చికాకు కలిగిస్తుంది. ఉద్యోగస్తులు అధికారులతో సంభాషించేటప్పుడు మెలకువ అవసరం. నూతన వ్యాపారాలకు శ్రీకారం చుట్టండి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. నిరుద్యోగులు సదవకాశాలను జారవిడచుకుంటారు. g **తుల** : స్త్రీలకు ఆరోగ్యంలో చికాకులు తలెత్తినగానీ నెమ్మదిగా సమసిపోతాయి. హామీలు ఉండుట మంచిది కాదని గమనించండి. స్పెక్యులేషన్ చేయువారికి నూతన ఆలో చనలు స్ఫురిస్తాయి. ఆడిటర్లకు గుర్తింపు, రాణింపు లభిస్తుంది. హోటల్, తినుబండారాల వ్యాపారస్తులకు అనుకూలంగా ఉంటుంది. h **వృశ్చికం** : బంధువుల రాకతో గృహంలో సందడి కానవస్తుంది. ఇచ్చిపుచ్చుకునే వ్యవహారంలో మెలకువ వహించండి. ఇతరుల ఆంతరంగిక విషయాలలో జోక్యం చేసుకోకండి. శత్రువులపై విజయం సాధిస్తారు. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తికరంగా సాగుతాయి. తల, మెడ, నడుము, నరాలకు సంబంధించిన చికాకులు ఎదుర్కోక తప్పదు. i **ధనుస్సు** :రాజకీయాలలోని వారికి స్నేహ బృందాలు అధికమవుతాయి. సోదరీ, సోదరుల మధ్య చిన్న అభిప్రాయ బేధాలు తలెత్తవచ్చు. రుణ ప్రయత్నాలు వాయిదా పడతాయి. కొత్త పరిచయాలు ఏర్పడతాయి. ప్రముఖులతో సంప్రదింపులు జరపుతారు. మధ్యవర్తిత్వంవల్ల ఇబ్బంది పడతారు. ఖర్చులు అధికం. j **మకరం** : ప్రింటింగ్, స్టేషనరీ రంగాలపట్ల ఏకాగ్రత వహిస్తారు. కాంట్రాక్టర్లకు ఊహించని సమస్యలు తలెత్తినా పరిష్కరించుకో గలుగుతారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొన్నప్పటికీ ఏకాగ్రత వహించలేరు. క్రయ, విక్రయ రంగాలలోని వారికి శ్రమకు తగిన ప్రతిఫలం దక్కుతుంది. తొందరపడి వాగ్దానాలు చేసి సమస్యలను తెచ్చుకోకండి. k **కుంభం** : దంపతుల మధ్య కలహాలు తలెత్తుతాయి. కోర్టు వ్యవహారాలు పరిష్కార దిశగా నడుస్తాయి. మీ సంతానం కోసం ధనం అధికంగా వ్యయం చేస్తారు. బంధుమిత్రులతో కలిసి ఆలయాలను సందర్శిస్తారు. కొబ్బరి, పండ్లు, పూలు, చల్లని పానీయ వ్యాపారులకు లాభ దాయకంగా ఉంటుంది. L **మీనం** :నిరుద్యోగులకు ఇంటర్వ్యూలలో మెలకువ అవసరం. క్రయ విక్రయ రంగాల లోని వారికి శ్రమకు తగిన ప్రతిఫలం దక్కుతుంది. తలపెట్టిన పనిలో సఫలీ కృతులు కాగలరు. దూర ప్రాంతాలకై చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. నిత్యావసర వస్తు స్టాకిస్టులకు సంతృప్తి కానవస్తుంది. పాత వ్యవహారాలు పరిష్కార మార్గంలో నడుస్తాయి.

# రాజసం ఉట్టిపడే రాతి నిర్మాణాలు

## సంకీర్తన

త్రికుటేశ్వరాలయం



సూర్యాపేటకు తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉన్న పిల్లలమర్రిలో కాకతీయుల కాలంలో జీవం పోసుకున్న దేవాలయాలు, శిల్పకళా సంపద.. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తున్నాయి. బౌద్ధ మతానికి సంబంధించిన ప్రతిమలను, జీవిత ఘట్టాలను, జ్ఞానోదయ చిత్రాలతోపాటు శాంతి చిహ్నాలు తదితర సన్నివేశాలు, ఆరామ కుడ్యాలపై ఎంతో అద్భుతంగా చెక్కబడ్డాయి. బౌద్ధ శిల్పకళలో సహజ సుందర దృశ్యాలకు, పశు పక్షాదులకు కూడా స్థానం లభించింది. అయితే మత ప్రచారానికి తోడ్పడే విధంగా అది రూపాంతరం చెందింది. ఉత్తర దక్షిణ శిల్పకళా సంస్కృతుల సమ్మేళనంతో కొత్త తరహా శిల్పకళను ఇక్కడ ప్రవేశపెట్టిన ఘనత కాకతీయులకే దక్కింది. క్రీ.శ.1000 నుంచి 1324 వరకు కాకతీయరాజులు ఆంధ్రదేశాన్ని పరిపాలించారు. ఇదే కాలంలో వారి సామంతులుగా, మాండలికులుగా నల్లగొండను పాలించిన రేచర్ల వంశస్థులు ఈ తరహా శిల్పాలను ఆదరించారు. వీటిలో భాగంగానే పిల్లలమర్రి, పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం గ్రామాల్లో నిర్మించిన దేవాలయాలు శిల్పుల మేధాశక్తి, కళలకు ప్రతీకలుగా చెప్పవచ్చు. ఒకవైపు కాకతీయ సామ్రాజ్య సంరక్షణకు యుద్ధాలు చేస్తూనే మరోవైపు శిల్పకళను ప్రోత్సహించడం వారి బహుముఖ ప్రజ్ఞాపాటవాలకు నిదర్శనం. ఆనాటి శిలలపై నగ్న దృశ్యాలు, సౌందర్య కుసుమాలు తదితర దర్పణంలాంటి చెక్కడాలు కళ్లను మైమరిపిస్తాయి.

**త్రికుటేశ్వరాలయం**

పిల్లలమర్రి గ్రామం ఉన్న త్రికుటేశ్వరాలయాన్ని కాకతీయుల రాజు అయిన రేచర్ల నామిరెడ్డి క్రీ.శ.1202లో నిర్మించారు. దుందుభి నామ సంవత్సరం చైత్రశుద్ధ ఏకాదశి శనివారం నాడు రాజు తన పేర నామేశ్వరలింగం ప్రతిష్ఠించి పూజాధికారులకు, దూపదీప నైవేద్యాలకు భూదానం ఇచ్చారు. ఈ విషయం వివరిస్తూ అక్కడ శాసనం కూడా రాయించారు. అదే ఆలయంలో మూడు శివాలయాలు ఏర్పాటు చేశారు. నామిరెడ్డి పేరు మీద నామేశ్వరాలయం మొదటిది కాగా, రాజు తన తల్లి పేరు మీద కాచేశ్వర, తండ్రి పేరున కామేశ్వర లింగాలను దేవాలయంలో ప్రతిష్ఠించాడని శాసనంలో ఉంది.

**దేవాలయాలతోపాటు పెద్దచెరువు**

పిల్లలమర్రిలో శిల్పకళా సంపద ఉట్టిపడే దేవాలయాలే కాదు.. త్రికుటేశ్వరాలయానికి అతి సమీపంలో పెద్ద చెరువు కూడా ఉంది. మూసీ నదిలో నీళ్లున్నంత కాలం ఆ చెరువులో జలకళ ఉట్టిపడుతుంది. **800 ఏళ్ల నాటి బావి**

ఎరుకేశ్వరాలయ ఆవరణలో 800 సంవత్సరాల క్రితం బేతిరెడ్డి భార్య ఎరుకసాని తాగునీటి కోసం తవ్వించిన బావి ఇప్పటికీ ఉంది. ఎంతటి వర్షాభావ పరిస్థితులు నెలకొని కరువు వచ్చినా ఆ బావిలో నీరు ఇంకిపోలేదని గ్రామస్తులు చెబుతున్నారు.

**త్రికుటాలయంలో ఆసక్తికరమైన నంది**

త్రికుటేశ్వరాలయంలో శివలింగాలను కాపాడేందుకు రేచర్ల నామిరెడ్డి నంది విగ్రహాన్ని చేశారు. ఆ నంది మూడు శివలింగాలను కాపాడుతున్నట్లు అనిపిస్తుంది. మూడింటిలో ఏ శివలింగం ముందు నిలబడి చూసినా నంది దాని వైపే చూస్తునట్లుగా కనిపిస్తుంది. అక్కడకు వచ్చే భక్తులు మూడు లింగాలను దర్శించుకొని వెళ్తుంటారు.



రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

FINANCE
ఒన్లీ రిటైర్డ్ పెన్షనర్లకు మాత్రమే
రూ. 30వేల నుండి 3 లక్షల వరకు
విశాఖ నుండి విజయవాడ వరకు
మధ్యలో ఎక్కడైనా సరే స్పాట్ ఫైనాన్స్
(with A/c Pay) చేయబడును.
JK అసోసియేషన్ సర్వీసెస్
Govt. Reg. No. 136/2009 (నో బ్రోకర్స్)
93969 99669

**LOSS OF PASSPORT**

I, PASUPULETI VENKATESH, S/o PASUPULETI RAMBABU, Residing at D.No. 9-2-243, PENTAYYA NAGAR, GAJUWAKA, VISAKHAPATNAM, AP 530026, hereby declare that I lost my original Passport No.P2271151 Issued on 3 NOV,2016 by Passport Office, Visakhapatnam, Valid upto: 2nd NOV, 2026 while I was traveling by bike from my house Pentayya nagar to Gajuwaka, Visakhapatnam for taking Photostat copies, I tried my level to trace, but in vain. If any one found, please contact

8185091496

**CHANGE OF NAME**

I, VENKAT LAKSHMI KATHA (Old Name) D/o.SUBBA RAO KETHA residing at. 1-107, KOTHA PETA, DIGAMARRU, PALAKOLLU, WEST GODAVARI Change my name from VENKAT LAKSHMI KATHA (Old Name) to VENKATA LAKSHMI KETHA (New Name) Hence forth I am being called as VENKATA LAKSHMI KETHA (New Name) For all purpose.

### తాటాకు ఇల్లు దగ్ధం

కోటవురట్ల : మండలం అక్సాసాబ్‌పేటలో విద్యుత్ షార్టు సర్క్యూట్ కావడంతో తాటాకు ఇల్లు దగ్ధమైంది. ధార తల్లి అనే మహిళకు చెందిన తాటాకు ఇల్లు విద్యుత్ షార్టు సర్క్యూట్ కావ డంతో అగ్నికి ఆహుతైంది. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేక పోవడంతో ఫ్రిజ్, బీరువా తదితర వస్తువులు కాలి పోయాయి. కాగా ఈ ప్రమాదంలో 2లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది.

### ఉపాధి హామీ పథకం ఆడిట్

కోటవురట్ల : రామచంద్ర పురంలో జాతీయ ఉపాధి హామీ పథకం ఆడిట్ గ్రామ సభ జరిగింది. గ్రామంలో ఆడిట్ బృందం డిఆర్‌పి ఎం.రాజు ఆధ్వర్యంలో మూడు రోజులుగా గ్రామంలో పర్యటించి అభివృద్ధి పనులు, వేతనాలు, నెలవారీగా అర్హు లైన లబ్ధిదారులకు అంద జేస్తున్న పింఛన్లు, ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన నీటి గుంతలు, కందకాలు, పండ్ల తోటల పెంపకంకు సంబంధించిన అభివృద్ధి పను లపై విచారణ చేశారు. నివేదిక రామాలయంలో 60 అభివృద్ధి పను లకు 23లక్షల రూపాయల నిధులు ఖర్చు చేసినట్లు గ్రామసభలో వెల్లడించారు.

మహారాజశ్రీ విశాఖపట్నం జడ్జి అడిషనల్ ఫ్యామిలీ కోర్టు
ఓ ఫి 521/ 2019
Between:
షేక్ గౌసియా అలియాస్ ఎస్ కే.గులాబీ ...పిటిషనర్
And:
షేక్ జిలాని ...రెస్పాండెంట్
నోటీసు
To
షేక్ జిలాని S/o.షేక్ షావలీ
ప్రస్తుత నివాసం డోర్ నెం.18-2, ఐమాక్స్ వెనుకన
కృష్ణమ్మ గుడి ఎదురుగా, శివరాజుగారిపేట
హౌండీ రోడ్, హౌండీ భీమవరం
పశ్చిమ గోదావరి జిల్లా.
ఇందుమూలముగా మీకు తెలియజేయడమేమనగా పై వాది అనగా మీ భార్య మీ నుండి విడాకులు కోరుతూ మీ పై పిటిషన్ దాఖలు చేసియున్నారు. మీకు పలుమార్లు నోటీసులు పంపిననూ చేరనందున పై కోర్టు వారు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయమని ఆదేశించి పై దావాను **30-12-2019 తేదీకి** వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరు తేదీ నాడు ఉదయం **10.30 గంటలకు** ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనంతట పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.
(కోర్టు వారి ఆదేశాల మేరకు)
వాయిదా 30-12-2019
సయ్యద్ అబ్దుల్ రజాక్
వాది తరపు న్యాయవాది
విశాఖపట్నం.
సెల్ నెం:9885240837

## శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం అభివృద్ధి పనుల కోసం వినతి

చీడికాడ : బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామంలో శ్రీ వెంకటేశ్వర దేవస్థానం అభివృద్ధి పనుల కోసం తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ వడ్డాది గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధి పనుల కోసం తిరుమల తిరుపతి దేవస్థానం నిధుల ద్వారా అభివృద్ధి పరచడానికి ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డికి వినతిపత్రం ఎమ్మెల్యే ధర్మశ్రీ సమర్పించారు.

## స్వర్గీయ పీవీరావు ఆశయాలతో ముందుకు సాగాలి : నక్కా రాజశేఖర్



కాకినాడ : మాల జాతి ముద్దు బిడ్డ, మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ పీవీరావు ఆశయాలతో ముందుకు సాగాలని రాష్ట్ర మాల ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నక్కా రాజశేఖర్ అన్నారు. పీవీరావు 14 వర్ధంతి పురస్కరించుకొని స్థానిక బాలాజీ చెరువు సెంటర్‌లో పీవీ.రావు చిత్ర పటానికి రాజశేఖర్ పూల మాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాల జాతి అభ్యున్నతి కొరకు తన ఉద్యోగంతో బాటు తన ప్రాణాలు కోల్పోయిన పీవీ.రావును ప్రతి మాల ఉద్యోగులు,విద్యార్థులు, ప్రజలు గుర్తించుకోవాలని, పీవీ.రావు ఆశయాలను గుర్తించు కుని ముందుకు వెళ్లాలని రాజశేఖర్ చూసించారు.జాతి కోసం ప్రాణాలు విడిచిన స్వర్గీయ పీవీ.రావు ధన్యజీవి అన్నారు. పీవీ.రావు జన్మదినోత్సవం నాటికి కాకినాడలో. పీవీ.రావు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.ఈ సమావేశంలో మాల మహానాడు జిల్లా నాయకులు జగడం రాజబాబు, నేతల జూన్‌బాబు, బలసాది శ్రీనివాస్, డి.దుర్గాప్రసాద్, వి.రాజ, యల్.ప్రభాకర్, ఎన్.భాస్కర్. ఉద్యో గులు. ఎన్.సరోజిని, ఆనంద్, టి.ప్రకాష్ మెరీనా తదితరులు పాల్గొన్నారు.

# కౌమారుల సాధికారత దేశ అభివృద్ధికి అవసరం




విశాఖపట్నం : సమతా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ మరియు యూని సెఫ్ ఆధ్వర్యంలో కౌమారుల సాధికారత గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.విజయ రవీంద్ర మాట్లాడుతూ జీవితంలో అత్యంత ముఖ్యమైన దశ కౌమార దశ అని కౌమారుల సాధికారత పైనే దేశ అభివృద్ధి ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. అనంతర కళా శాల డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ 9 సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల పిల్లల నా కౌమారులు అంటారని ఆ దశలో ప్రతి మనిషిలోని ఎన్నో శారీరక మానసిక పరమైన, సామాజిక పరమైన మార్పులు సంభవిస్తాయని వాటిని సక్రమంగా అర్థం చేసుకోవాలని అటువంటప్పుడు కౌమారులు జీవితంలో అద్భుతాలు సృష్టిస్తారు అని తెలియజేశారు. ఇందులో భాగంగా గవర్నమెంట్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎన్‌పి వి.రమణ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో కౌమారదశ ఎంతో కీలకమైందని ఎంతో కీలకమైనదని...

ఈ దశ పై అందరికీ అవగాహన కల్పించాల్సిన బాధ్యత. వాలంటీర్లు ఉందనిచెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్.ఎస్.ఎస్ పి.ఓలు జి.వెంకటేశ్వర రావు, డాక్టర్ బి.రాజేష్ కుమార్ కళాశాల అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

# డబ్బుల కోసం అగ్రిగోల్డ్ బాధితుల ఎదురుచూపు

నాతవరం : ప్రభుత్వం రూ.10వేల లోపు ఉన్న అగ్రిగోల్డ్ బాధితులకు డబ్బులు మంజూరు చేసినా కొందరికే అకౌంట్లలో జమయ్యాయని, ఇంకా చాలా మందికి పడలేదని పలువురు బాధితులు వాపోతున్నారు. గత ఏడాది పది వేల రూపాయల లోపు డిపాజిట్ చేసిన అగ్రిగోల్డ్ బాధితుల బ్యాంక్ అకౌంట్‌ల ఒరిజినల్ పాసు పుస్తకాలు, అగ్రిగోల్డ్ బాండ్‌లను విశాఖపట్నంలోని కోర్టులో ఇచ్చినట్లు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం బాధితులకు మంజూరు చేసిన నిధులు కొందరికి మాత్రమే అందాయని ఆరోపిస్తున్నారు. ప్రతీ పది రోజులకు ఒకసారి వెళ్లి అకౌంట్లు చూసుకుంటున్నామని, డబ్బులు పడకపోవడంతో నిరాశ చెందాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితులందరికీ డబ్బులు అందే ఏర్పాటు చేయాలని గుమ్మిడిగొండకు చెందిన పైల అప్పలనాయుడు, మడక పోతురాజు విజ్ఞప్తి చేస్తున్నారు.

# విలువులతో కూడిన విద్యను అందించాలి



మధురవాడ : మహా విశాఖ 5 వ వార్డ్ పరిధి వుడా కాలనీ ఆర్టీసీ కాలనీ లో గల హై ఫీల్డ్స్ పాఠశాల నందు ప్రథమ వార్షికోత్సవం ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. బాలాజీ హై ఫీల్డ్ విద్యాసంస్థల చైర్పర్సన్ మండవ రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కనకమహాలక్ష్మి బ్యాంక్ వైస్ చైర్మన్ సి.ఆర్.రెడ్డి విద్యాసంస్థల మాజీ అధిపతి కొమ్మారెడ్డి రాంబాబు, మండవ ప్రణీత్ అతిథులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం చిన్నారులు చేసిన సాంస్కృతిక నృత్య కార్యక్రమాలు అలరించాయి, ఈ సందర్భంగా ముఖ్య అతిథి రాంబాబు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థుల యొక్క సంస్కృతి సాంప్రదాయాలు మానవ విలువలతో కూడిన విద్యను అందిస్తున్న బాలాజీ విద్యా సంస్థలను కొనియాడారు. ఈ కార్యక్రంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెల పెంపకంలో తగిన జాగ్రత్తలు ద్వారా లాభాలు ఆర్జించవచ్చు

**- అడ్డూరులో గొర్రెల పెంపకం దార్ల శిక్షణా తరగతుల కార్యక్రమంలో చోడవరం పశు వైద్యశాల ఏడి టి.చిన్నంనాయుడు**



అడ్డూరులో గొర్రెల పెంపకంలో మెళకువల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పశువైద్యాధికారులు

చోడవరం : గొర్రెల పెంపకంలో సకాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అధిక లాభాలు ఆర్జించవచ్చని చోడవరం పశువైద్యశాల ఏ.డి, టి.చిన్నంనాయుడు అన్నారు. మండలంలోని అడ్డూరు గ్రామంలో గొర్రెల పెంపకం దారు లకు సోమవారం ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ద్వారా అందించే పథకాలు తదితర వాటిపై వివరించారు. స్థానిక పశువైద్యాధికారి ఎ.అరుణ కుమారి గొర్రెలలో సాధా రణంగా వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యలు వివరిం చగా, గవరవరం పశువైద్యాధికారి టి.ప్రశాంత్ గొర్రెల పెంపకంలో ఆధునిక పద్ధతులు, పోషణలోని మెళుకువల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జయమిత్ర పరమేష్, ఆసుపత్రి పశువైద్య సిబ్బంది, గొర్రెల కాపురుల సంఘ అధ్యక్షులు బొరా అప్పారావు ఇతర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా శ్రీ సత్యదేవుని మెట్లోత్సవం

**- తొలి మెట్టుకు కొబ్బరికాయ కొట్టి మెట్లోత్సవాన్ని ప్రారంభించిన ఈవో వి.త్రినాధరావు,ఛైర్మన్ ఐ.వి.రోహిత్.**



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి వాసుడైన శ్రీ సత్యదేవుడు కొలువైన రత్నగిరికి వెళ్లే మెట్ల మార్గంలో సోమవారం మెట్లోత్సవం సందర్భంగా ఘనంగా ముత్తయిదువులు మెట్లకు పూసిన పసుపు, కుంకుమ, పుష్పాలు అలంకరణ,కర్పూర హారతి,నైవేద్యము సమర్పించడంతో మెట్ల మార్గం ప్రత్యేక శోభను సంతరించు కుంది. ఉదయం 8 గంటలకు సత్యదేవుడు,అనంతలక్ష్మీ అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో మెట్ల మార్గంలో కిందికి తీసుకొచ్చి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం తొలిపావంచాల వద్దకు తీసుకొచ్చి అర్చకులు, పండితులు, పురోహితుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈవో వి.త్రినాధరావు,ఛైర్మెన్ ఐ.వి.రోహిత్ లు తొలి మెట్టుకు కొబ్బరికాయ కొట్టి మెట్లుకు హారతి ఇచ్చి మెట్లోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు మెట్టు మెట్టుకు పసుపు, కుంకుమ, పుష్పాలతో అలంకరించి,నైవేద్యం సమర్పించి కర్పూర హారతి వెలిగించి స్వామి,అమ్మవార్లను మెట్ల మీదుగా ఊరేగించి కొండపైకి చేరుకున్నారు. సత్యదేవుని నామస్మరణతో మొత్తం 450 మెట్లుకు పూజలు చేస్తూ ప్రధానాలయం వద్ద చివర మెట్టు వరకు చేరుకుని చివరకు అనివేటి మండపం వద్ద హారతి వెలిగించడంతో మెట్లోత్సవ కార్యక్రమం ముగిసింది.అనంతరం భక్తులు శ్రీ స్వామివారి దర్శనం చేసుకున్న తరువాత శ్రీ స్వామివారి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.పూజా కార్యక్రమాలు వేద పండితులు కపిలవాయి. రామశాస్త్రి, గొల్లపల్లి ఘనాపతి, ముష్ట. కామశాస్త్రి, ఆలయ ప్రధాన అర్చకులు కొండవీట సత్యనారాయణ, అర్చకులు నాగాభట్ల. కామేశ్వరరావు, చామర్తి. కన్నబాబు, ముత్య. సత్యనారాయణ తదితరులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో వి.త్రినాధరావు,ఛైర్మెన్ ఐ.వి.రోహిత్, ఏఈవో ప్రసాద్, పిఆర్వో కొండలరావు, సూపరిం టెండెంట్లు కోటమర్తి. సతీష్,అనకాపల్లి. ప్రసాద్,గొల్లు. సత్య నారాయణ, బలువు.సత్య శ్రీనివాస్,టెంపుల్ ఇన్ స్పెక్టర్ పోల్నాటి లక్ష్మి నారాయణ మరియు దేవస్థానం అధికారులు, సిబ్బంది,అధిక సంఖ్యలో భక్తులు,గ్రామస్థులు పాల్గొన్నారు.



# విద్య శక్తివంతమైనది

చీడికాడ : దేశాభివృద్ధికి సమాజంలో మార్పులకు చదువే ముఖ్యమని, అన్నిటికంటే శక్తివంతమైనది జ్ఞానమేనని టక్సాస్ యూనివర్శిటీ డాక్టరేట్ గ్రహీత ముద్ర పవిత్ర తేజస్విని అన్నారు. వడ్డాది జడ్పీ హైస్కూల్‌లో సోమవారం సిడిసి మాజీ ఛైర్మన్ దొండా రాంబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆమె ముఖ్య అతిధిగా మాట్లాడారు. బాల్య వివాహాలు అనర్ధాలు, బాలికల విద్య ఉపయోగాలు పై అవగాహన కల్పించారు. చదువు కన్నా శక్తివంతమైనది మరొకటి లేదన్నారు. విద్యను ఎవరూ దోచుకోలేరన్నారు. స్త్రీ, పురుషులిద్దరూ విద్యలో సమాన స్థాయిలో ఉన్నప్పుడే వివాహాలు చేసుకోవడం మంచిదన్నారు. నన్నయ్య యూనివర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ముద్రా ముత్యాలనాయుడు మట్లాడుతూ విద్య ప్రాధాన్యతను వివరించారుఏ. బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. అమెరికాలో పిహెచ్‌డీ పూర్తి చేసిన తేజస్వినిని దొండా రాంబాబు శాలువాతో సత్కరించారు. తేజస్వినిని అభినం దించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భరతశ్రీ, హైస్కూల్ హెచ్ఎం మూర్తిరాజు, మాజీ వైస్ ఎంపీపీ దాడి సూరి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ నానాజీ, దొండ రాజా, సయ్యపు రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## న్యూ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలని జోనల్ కమిషనర్‌కు బట్టు వినతి



పరవాడ : జివిఎమ్‌సి పరిధి 55వవార్డులో గల ఈసరపు వానిపాలెంలో కమ్యూనిటీ హాల్ హుధూద్ తుపాన్ కారణంగా కూలిపోయినిది. ఈ కమ్యూనిటీ హాల్ ను మరల కొత్తగా నిర్మించాలని 55వ వార్డు అధ్యక్షులు బట్టు సన్యాసిరావు సోమవారము జోనల్ కమిషనర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ప్రెసిడెంట్ ఈసరపు వెంకటరావు, వార్డు యూత్ వైస్ ప్రెసిడెంట్ పిట్ట వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



**వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ఎంపీ రవీంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభా కాంక్షలు తెలిపిన రెల్లి కుల సంక్షేమ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి శ్రీనివాసరావు, జుంజూరు గోవిందరావు, యర్రంశెట్టి జగదీశ్వరరావు, దేవరాపల్లి చిన్నారావు తదితరులు**

### ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆటో... విద్యార్థి దుర్మరణం

ఎస్.రాయవరం : అందివచ్చిన కొడుకు ఆసరాగా నిలుస్తాడని ఆశించిన తల్లిదండ్రులకు విధి వక్రించి ప్రమాదం రూపంలో కొడుకును కాటేసింది. తన తండ్రి పండించిన టమాటాలను ఎస్.రాయవరం మండలం గోకులపాడు గ్రామంలో గల వ్యాపారికి అందజేసేందుకు ఆటోలో టమాటాలను తీసుకుని బయల్దేరాడు. వెదుళ్లపాలెం జంక్షన్ వద్దకు వచ్చేసరికి జాతీయ రహదారి పక్కనే ఆగివున్న లారీని బలంగా ఢీ కొట్టడంతో అనంతసాయి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద విషయం తెలిసి వెంటనే గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

## కనకం 916 మా తొలి ప్రయత్నం

**- దర్శక, నిర్మాతలు రాకేష్, లక్ష్మణరావు**



అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం పరిసర ప్రాంతాలలో ఎల్.ఆర్ క్రియేషన్స్ బేనర్ పై కేరాఫ్ కంచరపాలెం ఫేమ్ మోహన్ భగత్, నూతన తార వైశాఖి బోనం హీరో, హీరోయిన్లుగా కొత్త దర్శకుడు రాకేష్ పోతాప్రగడ దర్శకత్వంలో నిర్మాణం పూర్తి చేసుకున్న కనకం 916 కేడీఎం సినిమా పూర్తి హాస్యభరిత కుటుంబ కథాచిత్రంగా ఉంటుందని చిత్ర నిర్మాత బూరగాపు లక్ష్మణరావు అన్నారు. అన్నవరం తోపాటు చుట్టుప్రక్కన గల కొత్తపల్లి, శృంగవృక్షం,తొండంగి, ఒంటిమావిడి,ఉప్పాడ,పెద మల్లాపురం తదితర చోట్ల చిత్రించిన ఈ చిత్ర నిర్మాణం దాదాపు పూర్తయిన సందర్భంగా చిత్ర యూనిట్ సోమవారం స్థానిక స్నేహ రెసిడెన్సీలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్మాత లక్ష్మణరావు మాట్లాడుతూ సత్యదేవుని ఆశీస్సులతో ప్రారంభించిన తమ కనకం 916 కేడీఎం సినిమా చిత్రీకరణ ఎటువంటి ఆటంకాలు లేకుండా 98 శాతం పూర్తిచేయడం జరిగిందన్నారు.ఇది పూర్తి గ్రామీణ వాతావరణంలో నిర్మించాలనే ఉద్దేశ్యంతో దర్శకుని కోరిక మేరకు పూర్తి భాగాన్ని అన్నవరం చుట్టుప్రక్కల గ్రామాల్లో చిత్రించామని తెలిపారు.ఈ సందర్భంగా దర్శకుడు రాకేష్ మాట్లాడుతూ పూర్తి తెలుగుదనం ఉట్టిపడేలా, పూర్తిగా తెలుగు నటీనటులతో 63 రోజులపాటు రెండు షెడ్యూళ్లలో సినిమా చిత్రీకరణ పూర్తిచేసామన్నారు.10 ఏళ్లపాటు క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీ తోపాటు పలువురి దర్శకుల వద్ద సహాయ దర్శకుడిగా పనిచేసిన తనకు తమ తల్లిదండ్రులు జన్మనిస్తే దర్శకుడిగా లక్ష్మణరావు మరోజన్మ ఇచ్చారన్నారు. సుమారు రూ.4 కోట్లతో నిర్మించిన ఈ చిత్రంలో సంపూర్ణేష్ బాబు, సత్యప్రకాష్,జబర్దస్త్ నటులు రచ్చ రవి,అప్పారావు,రైజింగ్ రాజు,దొరబాబు తదితరులు ఇతర ముఖ్య పాత్రలలో నటించగా చిత్రానికి సంగీతం రాయల్ రాజ్ సమకూర్చినట్లు తెలిపారు. ఈ ప్రయత్నాన్ని ప్రేక్షకులు మనసారా ఆశీర్వదించి చిత్రాన్ని విజయవంతం చేయవలసిందిగా ఆయన కోరారు.

# వియంఆర్డిఏ గ్రీవెన్స్‌కు 24 వినతులు

**- వారంలోగా ఖచ్చితంగా పరిష్కారం కావాలి - వియంఆర్డిఏ కమిషనర్ పి.కోటేశ్వరరావు**



విశాఖపట్నం : ప్రతి సోమవారం వియంఆర్డిఏలో నిర్వహించే ఓపెన్ ఫోరం గ్రీవెన్స్ కు ఈ సోమవారం 24 దరఖాస్తులు అందాయి. ఈ దరఖాస్తులను వియంఆర్డిఏ కమిషనర్ పి. కొటేశ్వర రావు స్వీకరించారు. అందిన దరఖాస్తులలో ఒకటి ఇంజినీరింగ్, అలాట్మెంట్కు మూడు, 8 దరఖాస్తులు ఎస్టేట్ విభగానికి, 11 ప్లానింగ్ విభాగానికి సంబంధించినవి కాగా చీఫ్ అక్కౌంట్స్ అధికారి హరి ప్రసాద్ కు 1 దరఖాస్తు వచ్చాయి. ఈ దరఖాస్తులను ఆయా విభాగాధికారులైన సెక్రెటరీ ఏ.శ్రీనివాస్, ఎస్.ఈ రామ్మోహన్‌రావు, ఎస్టేట్ అధికారి లక్ష్మణ మూర్తి, చీఫ్ అర్బన్ ప్లానర్ సురేశ్‌కు, చీఫ్ అక్కౌంట్స్ అధికారి హరిప్రసాద్ లకు దరఖాస్తులను అందజేసి పరిశీలించి వారంలోగా ఖచ్చితంగా పరిష్కారం కావాలని వియంఆర్డిఏ కమిషనర్ పి. కొటేశ్వరరావు ఆదేశించారు. ఈ గ్రీవెన్స్ నందు ఈఈలు బలరామరాజు, భవాని శంకర్, మురళీకృష్ణ, ఉమా శంకర్, బాచి నాయుడు, సోమశేఖర్, డి.డి.దొర, ప్లానింగ్ అధికారులు సుశీల, సాయిబాబా తదితరులు హాజరైనారు.

# ఆదర్శమూర్తి మారెడ్ల సత్యనారాయణ



విశాఖపట్నం :డాబాగార్డెన్స్, ప్రేమ సమాజము కమిటీ వారి ఆధ్వర్యంలో ప్రేమ సమాజములోగల న్యూ సమావేశ మందిరంలో ప్రేమ సమాజము వ్యవస్థాపకులు స్వర్గీయ మారెడ్ల సత్య నారాయణ వర్ధంతిని ఘనంగా నిర్వహించినాము. ఉదయం బాల బాలికలు, కార్యదర్శి, ఆఫీస్ సిబ్బంది ప్రభాతభేరి నిర్వహించడమైనది. సాయంత్రం జరిగిన సమావేశమునకు ముఖ్య అతిధిగా ప్రేమ హాస్పిటల్స్ మేనేజింగ్ ట్రస్టీ డా.ఎస్.వి.ఆదినారాయణ రావు హాజరై మారెడ్ల సత్యనారాయణ మహాలక్షమమ్మ దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి మారెడ్ల సత్య నారాయణ చిత్రపటము ముందు జ్యోతిని వెలిగించి సంస్మరణ సభను ప్రారంభించారు. అనంతరం డా.ఎస్.వి.ఆదినారాయణ రావు సభికులను ఉద్దేశించి ప్రసంగిస్తూ నిరాశ్రయులైన వారికి ఆశ్రయం కల్పించాలని మానవత్వంతో ప్రేమ సమాజాన్ని స్థాపించిన మారెడ్ల సత్యనారాయణ ఆదర్శ మూర్తిగా నిలిచారన్నారు. ప్రేమ సమాజము ఉన్నంత కాలం వారి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుం దన్నారు. ప్రతి ఒక్కరూ మారెడ్ల సత్య నారాయణను ఆదర్శంగా తీసుకొని జీవించా లన్నారు. సభాధ్యక్షులు బుద్ధ శివాజీ మాట్లా డుతూ శరణాలయాలు లేని రోజుల్లో విశాఖ పట్నంలో ప్రేమ సమాజాన్ని స్థాపించి మారెడ్ల సత్యనారాయణ దన్యజీవులైనారని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమం లో కార్యదర్శి కోన జగదీశ్వరరావు, డా.ఎన్.ఎస్. రాజు, ఆర్.వి. రమణారావు, ఎస్.సత్యనారాయణ, పి.ఆర్.ఓ. ఎమ్.వి.రాజశేఖర్, కమిటీ సభ్యులు, ఆశ్రమవాసులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ పొదుపు ప్రగతికి మలుపు




మధురవాడ : విద్యుత్ పొదుపు వారోత్సవాలలో భాగంగా సోమవారం సాయంత్రం మధురవాడ విద్యుత్ సబ్ స్టేషను నుండి జాతీయ సేవా మార్గం మీదుగా ఎత్తు వంతెన కొమ్మాది నుండి తిరిగి సబ్ స్టేషన్ వరకు విద్యుత్ పొదుపు ప్రగతి కి మలుపు అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు, ఈ ర్యాలీ విద్యుత్ జోన్ 3 ఇఇ సింహచలం నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు, ఈసందర్భంగ ఇఇ మాట్లాడుతూ అవసరం లేనప్పుడు తప్పనిసరిగా స్విచ్ ఆప్చేసి ఆదాకు సహకరించాలని వినియోగదారులను కోరారు, ఈ కార్యక్రమంలో జోన్ కి సంబందించిన డిఇలు, ఎఇలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదరణా2 అర్హులకు న్యాయం చేయాలి



కోటవురట్ల : గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆదరణా2 లబ్ధిదారులకు న్యాయం చేయాలంటూ సోమవారం లబ్ధిదారులు సిపిఎం ఆధ్వర్యంలో కోటవురట్ల ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు డేవిడ్‌రాజు, వెంకటస్వామి మాట్లాడుతూ 2018ా2019లో సుమారు 120 మంది బిసి వర్గానికి చెందిన వారు కుట్టు మిషన్లు, సైకిళ్లు, ఇస్త్రి పెట్టెలు వగైరాలు నిమిత్తం ప్రభుత్వానికి డిడి రూపంలో చెల్లించామని, మండలంలో కొంత మందికి వచ్చినా లింగాపురం గ్రామానికి రాకపోవడంతో ఈ ఆందోళన చేపట్టామన్నారు.

# మిసెస్ ఏవిఎన్.కాలేజీ ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్‌లో మొక్కలు నాటే కార్యక్రమం



విశాఖపట్నం : మిసెస్ ఏవిఎన్.కాలేజీ ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ ఈనెల 13 నుండి 19వతేదీ వరకు కల్లివానిపాలెంలో నిర్వహించుచున్నాము. దీనిలో భాగంగా సోమవారం 'మొక్కలు నాటే' కార్యక్రమంలో భాగంగా ఏవిఎన్.కళాశాల ప్రిన్సిపాల్ అయిన డి.వి.ప్రకాష్ మరియు ఎన్ఎస్ఎస్ పిఓలు డా.సిహెచ్. శ్రీనివాసరావు, ఎ.శ్రీలక్ష్మి, సిహెచ్ ఎంఎస్.కుమారి, వెంకట్రామన్ ఆధ్వ ర్యంలో సుమారు వందమంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ జడ్జి అయిన దామోదర్ మరియు ఏయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ హరినాధ్ వచ్చి మొక్కలు నాటే కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. మధ్యాహ్నం నుంచి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు మరియు ఈ కల్లివానిపాలెం గ్రామంలో వున్న 13-19 వయస్సు గల యూత్‌కి వాసవి మహిళా మండలి అధ్యక్షురాలైన మాధవి చేత చక్కటి సందేశాన్ని అందజేశారు. ఈ వారం రోజులు కార్యక్రమంలో ఏవిఎన్. కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.సిహెచ్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ఎన్ఎస్ఎస్ యూనిట్-2 వాలంటీర్ల చేత ఏయూలో ఒక క్యాంప్ కండక్ట్ చేస్తున్నారు. ఈ క్యాంప్‌లకు కూడా ఈనెల 13 నుండి 19వతేదీ వరకు స్వచ్ఛ భారత్, మొక్కలు నాటే కార్యక్రమం, మహిళా సాధికారత, నవరత్నాలు గురించి, నవశకం గురించి మరియు మెడికల్ క్యాంప్‌లను నిర్వహించనున్నారని ఎన్ఎస్ఎస్ నోడల్ ఆఫీసర్ డా.సిహెచ్.శ్రీనివాసరావు తెలియజేశారు.

# జనవరి 6న అప్పన్న ఉత్తరద్వార దర్శనం

**వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం : ఈఓ ఎం.వెంకటేశ్వర్లు**



సింహాచలం : శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి వారి ముక్కోటి ఏకాదశి ఉత్తరద్వారం దర్శనం శేషవాహనంపై వైకుంఠ వాసునిగా జనవరి 6 వ తేదీన భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్టు దేవస్థానం ఈఓ ఎం.వెంకటేశ్వర్లు తెలియజేశారు. సోమవారం సింహగిరి పై స్వామి వారి కళ్యాణమండపంలో వైదికులు వివిధ శాఖా అధికారులుతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశం అనంతరం మీడియా తో మాట్లాడుతూ ఈ ఉత్సవం జనవరి 6న లేదా 7న చేయాలా సందిగ్ధం నడుమ ప్రధాన అర్చకులు స్థానాచార్యులు ఇతర వైదిక సిబ్బంది తో చర్చించి చివరికి అన్ని దేవాలయాలు మాదిరి గానే 6వ తేదీన ఈ ఉత్సవం అంగరంగ వైభవంగా జరుపు తామని అందుకు సంబంధించి ఏర్పాట్ల పై ఇంజనీరింగ్ ఎలక్ట్రికల్ వాటర్ మరియు వివిద శాఖా అధికారులు కు పలు సూచనలు సలహాలు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం వైధికులు అర్చకులు వివిధ శాఖా ఏఈఓ లు ఏ ఈ లు డీఈలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయస్థాయి యోగా పోటీలకు చోడవరం రవి కాన్వెంట్ విద్యార్థులు ఎంపిక

చోడవరం : పట్టణంలోని రవి కాన్వెంట్‌లో 5వ తరగతి చదువుతున్న పందిరి వెన్నెల శ్రీ, 6వ తరగతి చదువుతున్న గొంతిన లయవర్ధన్ రాష్ట్రస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచి, జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు పాఠశాల కరస్పాండెంట్ మురళీ,, ఏవో శేఖర్ తెలిపారు.యోగా అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీలలో కాకినాడలో రెండు రోజులపాటు జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో 10 నుంచి 12 ఏళ్ళ బాలికల విభాగంలో పందిరి వెన్నెల శ్రీ రెండవ స్థానం సాధిం చగా, 10 నుంచి 12 ఏళ్ళ బాలుర విభాగంలో గొంతిన లయవర్ధన్ 4వ స్థానంలో సాధించారన్నారు. విజేతలకు ఏ.పి వ్యవసాయశాఖా మంత్రి కురసాల కన్నబాబు చేతుల మీదుగా బహుమతులు అందుకున్నట్లు తెలిపారు. జనవరి 20వ తేదీన ఢిల్లీలో నిర్వహించే జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు చోడ వరం పతంజలి యోగా కేంద్రం శిక్షకులు పుల్లేటి సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.




విద్యార్థులను అభినందిస్తున్న రవికాన్వెంట్ కరస్పాండెంట్ మురళీ, ఏవో శేఖర్

# నర్సాపురంలో ద్విచక్రవాహనంను ఢీకొన్న మినీ వ్యాను

**- కె.జి.బి.వి మహిళా వాచ్‌మెన్‌తో పాటు ద్విచక్రవాహనదారునికి తీవ్రగాయాలు - విశాఖ కె.జి.హెచ్‌కు తరలింపు**

చోడవరం : మండలంలోని కె. కోటపాడు ప్రధాన రహదారి నర్సాపురం జంక్షన్ సమీపంలో ద్విచక్రవాహనాన్ని మినీ వ్యాను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరకు తీవ్రగాయాలయ్యాయి. నర్సాపురం గ్రామం నుంచి వెంకన్నపాలెం వైపు వెళుతున్న ద్విచక్రవాహనంను కె.కోటపాడు నుంచి వెంకన్నపాలెం వైపు వస్తున్న మినీ వ్యాను వెనుక నుంచి బలంగా ఢీకొని కొద్ది దూరం ఈడ్చుకు పోవడంతో ద్విచక్రవాహనంపై వెళుతున్న ఇద్దరకు గాయాలయ్యాయి.




నర్సాపురంలో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన మినీ వ్యాను



ఘటనా స్థలం వద్ద స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్న చోడవరం ఎస్.ఐ, లక్ష్మీనారాయణ

ఈ ప్రమాదంలో వెంకన్నపాలెంకు చెందిన ద్విచక్రవాహనదారుడు కె.సూరిబాబు ఎడమ కాలు, తలపై తీవ్రగాయాలు కాగా, ద్విచక్రవాహనంపై వెనుక కూర్చున్న, నర్సాపురం కస్తూర్భాగాంధీ విద్యాలయంలో...

వాచ్ మెన్‌గా పనిచేస్తున్న అప్పల నర్సకు రెండు కాళ్ళు, తల భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో అంబులెన్సు సిబ్బంది చేరుకుని, క్షత గాత్రులకు అత్యవసర చికిత్స అందించి, అనంతరం అనకాపల్లి ఎన్.టి.ఆర్.ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు.

పరిస్థితి మరింత విషమంగా ఉండటంతో విశాఖ కె.జి.హెచ్.కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

ప్రమాద సమాచారం తెలుసుకున్న చోడవరం ఎస్.ఐ, లక్ష్మీనారాయణ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను సేకరిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ.తెలిపారు.

# జోన్-4 స్పందనకు 12 వినతులు



విశాఖపట్నం : జోన్-4 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి అర్జీదారులు వినతి పత్రాలు సమర్పిం చారు. ఉన్న వార్డులలో పలు సమస్య లపై జోనల్ కమిషనర్ పి.సింహాచలం నకు వినతి పత్రం అందించారు. వార్డుల్లో పలు సమస్యలపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## హర హర మహా దేవునికి రుద్రాభిషేకము
## శబరిగిరీశునికి 18 రకాల ద్రవ్యాలతో మహా అభిషేకం



మాధవధార: మాధవధారలో గురుస్వామి బమ్మిడి.సంతోష్ కుమార్ స్వామి, అతని పీఠంలో అయ్యప్పస్వామి మాలధారణ భక్తులు హరి హర మహాదేవుడు పరమేశ్వరునికి రుద్రాభిషేకము , హరి హర సుతుడు అయ్యప్పస్వామి వారికీ ద్రవ్యాభిషేఖం ను భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలుతో ఎంతో ప్రీతివంతమైన 18 రకాల ద్రవ్యలతో అభిషేకాలు చేసారు. ముందుగా గురు స్వామి సంతోష్ స్వామి స్పటిక లింగం నకు రుద్రాభిషేకమును చేసి తరువాత అయ్యప్ప స్వామి వారికీ విశేష పూజలను నిర్వహించి తరువాత 18రకాల ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి తరువాత పీఠం స్వాములతో అభిషేకం చేయించి, విశేషమైన పట్టు వస్త్రాలతో స్వామి వారిని అలంకరించి పూజ కార్యక్రమాలు ముగించారు. ఒక్కేసారి హర హర మహాదేవునికి,హరి హర సుతుడు అయ్యప్పస్వామి వారికీ ఇటువంటి పూజలు, అభిషేకాలు చెయ్యడం మా అదృష్టంగా భావిస్తున్నాను అని స్వాములు తెలియజేయటం జరిగింది.

## సామాజిక భవనాన్ని ప్రజలకే ఉపయోగించాలి



సింథియా/ములగాడ: సామాజిక భవనాన్ని గ్రామ సచివాలయ పాలనకు ఇవ్వవద్దని, గ్రామ ప్రజల అవసరాలకే వినియోగించాలని ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీ వాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. సోమవారం సామాజిక భవనాన్ని సచివాలయానికి కేటాయించడాన్ని నిరసిస్తూ సామాజిక భవనం వద్ద కాలనీ వాసులు ధర్నా నిర్వహించి, బైటాయించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక అవసరాలకోసం నిర్మించిన భవనాన్ని ఇతర అవసరాలకు ప్రభుత్వం వినియోగిస్తే స్థానికులు పలు ఇబ్బందులకు గురికావలసివస్తుందని ఆందోళన వ్యక్తం చేసారు. గతప్రభుత్వం ప్రజల అవసరాలకోసం సామాజిక భవనాలను నిర్మిస్తే వాటిని ఇప్పటి ప్రభుత్వం సొంత అవసరాలకోసం వాడుకోవడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వానికి అవసరమైతే సొంతభవనాలను నిర్మించుకుంటే బాగుంటుందన్నారు. గ్రామ సచివాలయ అధికారులు ఈ ప్రతిపాదనలను విరమించుకోవాలని, లేని యెడల పోరాటాన్ని ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో గ్రామ ప్రజలు పాండ్రంకి జయరాజ్, విసురెడ్డి, అమరావతి, చంటి, కుమారి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ ఉత్సవ్‌కు గంగవరం పోర్టు రూ.5లక్షలు విరాళం



గాజువాక: కార్పోరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా గంగవరం పోర్టు లిమిటెడ్ 5లక్షల రుపాయలను విశాఖ ఉత్సవ్ సాంస్కృతిక కార్యక్రమాలకోసం విరాళంగా అందజేసింది. డిసెంబర్ 28నుంచి 30వతేదీ వరకూ విశాఖపట్నంలో విశాఖ ఉత్సవ్ జరగనున్నది. దీనిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కలెక్టర్‌కు గంగవరం పోర్టు లిమిటెడ్ సంస్థ వైస్‌ప్రెసిడెంట్ (ఆర్.అండ్ ఆర్, సెక్యూరిటీ) బి.బాలకృష్ణ, వైస్‌ప్రెసిడెంట్ (లైజనింగ్ అండ్ సెక్యూరిటీ) ఎల్ పిఎస్ రామునాయుడులు చెక్‌ను అందజేసారు. ఈ సంధర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ వైజాగ్ ప్రజలకు విశాఖ ఉత్సవ్ అతిపెద్ద వేడుకగా నిలుస్తుందని, ఈ వేడుకలు అత్యంత ప్రాచర్యం పొందిని విశాఖ బీచ్ (ఆర్.కె.బీచ్) వద్ద జరగనున్నాయని తెలిపారు. ఆర్.కె.బీచ్ వద్ద నేవీ కెడేట్స్, పాఠశాల విద్యార్థులు కార్నివాల్ ప్రొసెషన్ చేయడంతో ప్రారంభమవుతాయని అన్నారు. సాయంత్రం నిర్వహించే నేవీ బ్యాండ్ ప్రదర్శనలను విశాఖ ప్రజలు అస్వాదిస్తారని అన్నారు. ప్రాంగణం వద్ద నిర్వహించే సంగీత కచేరీలుసైతం పలువురి ఆకట్టుకుంటాయని తెలిపారు. "స్వచ్ఛంద సాంస్కృతిక సంస్థలు, ప్రభుత్వం మద్దతునందించే సాంస్కృతిక సంస్థలకు మద్దతునందించాలన్నదే మా ప్రయత్నమని, తద్వారా స్థానిక కళలు మరియు సాంస్కృతిని ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రజలు మరియు సాంస్కృతిక సంక్షేమం కోసం గంగవరం పోర్టు సంస్థ యాజమాన్యం కట్టుబడి ఉందని అన్నారు. జిల్లా కలెక్టర్‌కు చెక్ నందించినవారిలో సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం



విశాఖపట్నం: యువర్ కలెక్టరు కార్యక్రమానికి 12 మంది ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించారు. ప్రత్యేక డిప్యూటి కలెక్టరు శ్రీనివాసమూర్తి వారి సమస్యలను విని సంబంధిత శాఖల అధికారులకు తగు చర్య నిమిత్తం నివేదించారు. కశింకోట మండలం ఎ.ఎస్.పేట గ్రామం నుంచి తిరుమలరావు మాట్లాడుతూ సచివాలయాలలో డేటా ప్రొసెసింగ్ పోస్టుకు దరఖాస్తు చేస్తే అర్హతలు ఉన్నారిజెక్టు చేశారని ఇతర జిల్లాలలో అంగీకరించారని , కాబట్టి న్యాయం చేయాలని కోరారు. చిన్న వాల్తేరు నుండి చిన్నారావు మాట్లాడుతూ తన ఇంటి స్థలాన్ని 22 ఎ క్రింద వుంచారని దాన్ని తొలగించాలని కోరారు. పాయకరావుపేట మండలం అట్లకోట గ్రామం నుంచి నూకరాజు మాట్లాడుతూ తమ గ్రామంలో మురుగు నీటి వలన ఆరోగ్య సమస్యలు

వస్తున్నాయని సి.సి.రోడ్లు వేసి డ్రైనేజీ కట్టాలని కోరారు. మాధవధార నుండి మోహనరావు మాట్లాడుతూ సర్వే నెం .49లోని తన ఇంటి స్థలాన్ని 22 ఎ లో పెట్టారని దాన్ని తొలగించి న్యాయం చేయాలని కోరారు. చోడవరం మండలం రాందేవుపల్లి నుంచి కొండలరావు మాట్లాడుతూ వార్డు సెక్రటరీ పోస్టుకు దరఖాస్తు చేసుకున్నా ఇంతవరకు ఏ సమాచారం లేదని తెలిపారు. రావికమతం మండలం కట్టబంధ గ్రామం నుంచి అప్పలనాయుడు మాట్లాడుతూ రైతు భరోసా మొత్తం ఇంతవరకు జమ కాలేదని తెలిపారు. విశాఖపట్నం నుంచి మూర్తి మాట్లాడుతూ భీమునిపట్నం మండలం

క్రొత్తవలస గ్రామంలో సర్వే నెం.90లో 14 సెంట్ల భూమికి ఎల్ ఆర్ ఎస్ లో 5 సం .క్రితం దరఖాస్తు చేసుకున్నానని ఇంతవరకు పెండింగులో వుంచారని తెలిపారు. నర్సీపట్నం నుండి శివనారాయణరాజు మాట్లాడుతూ ఆర్.టి.సి.కాంప్లెక్స్, సినిమాహాలులో పార్కింగు ఫీజులపై ఫిర్యాదు చేశారు. ఇంకా నర్సీపట్నం మున్సిపాలిటీలో బిల్డింగ్ ఇన్ స్పెక్టర్లు అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తూ అవినీతికి పాల్పడుతున్నారని వారిపై చర్య తీసుకోవాలని కోరారు. రోలుగుంట మండలం బుచ్చంపేట గ్రామం నుండి పోతురాజు మాట్లాడుతూ ప్రాధమిక ఆరోగ్య కేంద్రానికి రోడ్డు సదుపాయం లేదని వెంటనే పక్కారోడ్లు వేయాలని కోరారు. పెదగంట్యాడ మండలం అప్పికొండ గ్రామం నుండి వెంకట్ మాట్లాడుతూ సర్వే చేసి తప్పుడు నెంబరు ఇచ్చారని వెంటనే సరి చేయాలని కోరారు. మునగపాక మండలం నాగులపల్లి గ్రామం నుండి గంగాధర్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాలలో పోస్టుకు సర్టిఫికేట్

వెరిఫికేషన్ అయిపోయిందని ఇంతవరకు ఎలాంటి సమాచారం లేదని ఫిర్యాదు చేశారు. స్పందన కార్యక్రమానికి ఈ రోజు 965 వినతులు వచ్చాయి. ప్రజల నుండి వినతులను జిల్లా కలెక్టరు వి.వినయ్ చంద్, జాయింట్ కలెక్టరు ఎం.వేణుగోపాల్ రెడ్డి , ఆర్డీవో పి.కిషోర్ ప్రత్యేక డిప్యూటి కలెక్టర్లు రంగయ్య, శ్రీనివాసమూర్తి, ఇతర అధికారులు స్వీకరించారు.

## అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే కు రూ.100 కోట్లు



అమరావతి: అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే కోసం రూ.100 కోట్లు కేటాయించామని రాష్ట్ర ఆర్అండ్‌బి శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆయన సోమవారం ఈ అంశంపై శాసన మండలిలో మాట్లాడారు. అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవేకు అవసరమైన మేరకు మరిన్ని నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు మంత్రి తెలిపారు. దీనిని అత్యంత ముఖ్యమైన హైవేగా ప్రభుత్వం భావిస్తోందని కృష్ణదాస్ వెల్లడించారు. ఈ హైవే కోసం భూమిని సేకరించాల్సి ఉందని చెప్పారు. దీని నిర్మాణం కోసం ఇప్పటికే భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చామని మంత్రి తెలిపారు. అటవీశాఖ నుంచి కూడా అనుమతులు తీసుకుంటున్నామని కృష్ణదాస్ గుర్తు చేశారు. ట్రాఫిక్ అవసరాలను బట్టి హైవే ఎన్ని లైన్లతో వుండాలనేది పరిగణలోకి తీసుకుంటున్నామని మంత్రి ధర్మాన కృష్ణదాస్ పేర్కొన్నారు.

## సబ్సిడీ ఉల్లి విక్రయాలతో ఊరట
## హర్షం వ్యక్తం చేస్తున్న వినియోగదారులు



కాకినాడ: దేశ వ్యాప్తంగా ఉల్లి ధరలు హడలెత్తిస్తుంటే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయంతో వినియోగదారులపై భారం పడకుండా రైతు మార్కెట్‌లలో రూ.25కే ఉల్లి అందించడంతో వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా రైతు మార్కెట్ లలో ఉల్లి రూ.25కే అందిస్తున్నారు.దీనిలో భాగంగా కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రక్కన గల రైతు మార్కెట్‌లో ఉల్లి వినియోగదారులకు రేషన్ కార్డుపై రూ25కే ఉల్లి అందించేందుకు ఎస్టేట్ అధికారి రాయుడు శ్రీనివాస్ ప్రత్యేక ఏర్పాట్లు చేసి వినియోగదారులకు సబ్సిడీ ఉల్లి అందిస్తున్నారు. తమ సిబ్బంది సత్యనారాయణ మూర్తి,రాంబాబు, డివిఎస్ నారాయణను ఆయా కౌంటర్ల వద్ద నియమించి వినియోగదారులకు ఏవిధమైన ఆటకం కలుగకుండా, తూనికలో తేడా లేకుండా అందించేందుకు నిరంతరం పర్యావేక్షిస్తున్నారు. ఉదయం 7గం॥ల నుండి 11 గం॥టల వరకు,సాయంత్రం 4గం॥ల నుండి 7గం॥ల వరకు క్యూలో నిలుచున్న ప్రతి ఒక్కరికీ ఉల్లి అందే విధంగా చర్యలు తీసుకొంటున్నారు.

దీంతో వినియోగ దారులు సబ్సిడీ ఉల్లితో తమకు ఎంతో వ్యయం తగ్గుతుందని,ఉల్లిని రైతు మార్కెట్‌లో సక్రమంగా అందిస్తున్న ఎస్టేట్ అధికారి,సిబ్బంది పనితీరును పలురు కొనియాడారు.

## ఎలక్ట్రానిక్ గవర్నెన్స్‌తో పారదర్శక పాలన సాధ్యమవుతుంది



సింథియా/ములగాడ: ఇ-గవర్నెన్స్‌తో పారదర్శకపాలన సాధ్యమవుతుందని జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారిణి ఇ.పి.యస్. భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. నగరంలో మధురవాడలోని మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వంలో వివిధ శాఖలలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్స్‌లకు నిర్వహిస్తున్న శిక్షణా శిబిరంలో "ఇ-గవర్నెన్స్ లాభాలు-సవాళ్ళు" అనే అంశంపై రిసోర్స్ పర్సన్‌గా ఆమె పాల్గొని ప్రసంగించారు. ఇ-గవర్నెన్స్ ద్వారా పౌరులు ఎక్కడనుంచైనా ప్రభుత్వం సేవలు పొందగలుగుతున్నారని, పాలనలో సమర్ధత పెరుగుతుందని, తప్పులు తక్కువగా వస్తున్నాయని, ఖర్చుతగ్గుతొందని అన్నారు. ఈ-సేవా ద్వారా పౌరులకు 160రకాల సేవలు అందుబాటులోనికి వాచ్చాయని అన్నారు. అయితే ఇ-గవర్నెన్స్ ద్వారా నిరుద్యోగం పెరుగుతుందని, ఇంగ్లీషు భాష ఆధిఖ్యత పెరుగుతొందని, పేద-ధనిక, పట్టణ-గ్రామ ప్రజలు మద్య అంతరాలు పెరుగుతున్నాయన్నారు. మౌళిక సదుపాయాలు, ఇంటర్నెట్ సౌకర్యాలు, వైఫై సౌకర్యాలు సక్రమంగా లేకపోవడం వల్ల ప్రజలలో డిజిటల్ అక్షరాస్యత లేక పోవడం వలన అనేక సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. వీటిని అధిగమించి ఉద్యోగులు సాంకేతిక పరిజ్ఞానంతో పాలనా సంస్కరణలను కృషి చేయవలసిన అవసరం ఎంతైన ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మానవ వనరుల అభివృద్ధి కేంద్ర సిబ్బంది కార్తీక్, నూతనప్రసాద్, రవి, తదితరులు పాల్గొన్నారు.

## నాబార్డు వార్షిక ప్రణాళిక విడుదల చేసిన కలెక్టర్

శ్రీకాకుళం: 2020 21 ఆర్థిక సంవత్సరానికి నాబార్డు రూపొందించిన వార్షిక ప్రణాళికను జిల్లా కలెక్టర్ జె నివాస్ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో విడుదల చేసారు. రూ.7864.30 కోట్లతో రూపొందించిన ఈ ప్రణాళికలో పంట ఉత్పత్తి, నిర్వహణ, మార్కెటింగ్ కు రూ.4141.36 కోట్లు., వ్యవసాయం, అనుబంధ కార్యక్రమా లకు టర్మ్ రుణాలుగా రూ.1218.78 కోట్లు., వ్యవసాయ మౌళిక సదుపాయాలకు రూ.251 కోట్లు., అనుబంధ కార్యక్రమాలకు రూ.482 కోట్లు వెరసి వ్యవసాయ రంగానికి రూ.6093.56 కోట్లు కేటాయింపు చేయడం జరిగింది. సూక్ష్మ, చిన్న, మద్యతరహా పరిశ్రమలకు (ఎం.ఎస్.ఎం.ఇ) రూ.1206.62 కోట్లు., ఎగుమతి పరపతి (ఎక్స్‌పోర్టు క్రెడిట్) కు రూ. 10.50 కోట్లు., విద్యా రంగానికి రూ.26.08 కోట్లు., గృహనిర్మాణానికి రూ.328.41 కోట్లు., సాంప్రదాయ ఇంధన రంగానికి (రెన్యువబుల్ ఎనర్జీ) రూ.11.21 కోట్లు., బ్యాంకు క్రెడిట్ అనుసంధానంతో సామాజిక మౌళికసదుపాయాల కల్పనకు రూ.79 కోట్లు కేటాయించడం జరిగింది.

## ఆత్మరక్షణకు అవసరమగు మెలుకువలు కిక్‌బాక్సింగ్ ద్వారా నేర్చుకోవాలి
### -కిక్‌బాక్సింగ్ రాష్ట్ర అధ్యక్షులు కె.యన్.ఆర్.



గాజువాక: తనను తాను రక్షించుకునే స్థాయికి ప్రతీ ఆడపిల్లలు రావాలని, ఆత్మరక్షణకు కావలసిన మెలకువలు కిక్ బాక్సింగ్ ద్వారా నేర్చుకోవాలని కిక్‌బాక్సింగ్ రాష్ట్ర అధ్యక్షులు కర్ణంరెడ్డి నర్సింగరావు పిలుపు నిచ్చారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందధర్భంగా చినగంట్యాడ అమరావతి పార్క్‌లో జరిగిన పొట్టిశ్రీరాములు మెమోరియల్ కప్ జిల్లా స్థాయి ఓవరాల్ చాంఫియన్ షిప్ కిక్ బాక్సింగ్ పోటీలలో విజేతలకు బహుమతులను అందజేసే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా కిక్ బాక్సింగ్ రాష్ట్ర అధ్యక్షులు కర్ణంరెడ్డి నర్సింగరావు, కళాఆసుపత్రి అధినేత రమణమూర్తి, సీనియర్ న్యాయవాది ఆలీ, సాయి ఎస్టేట్స్ అధినేత మేడిశెట్టిరాజు పాల్గొని విజేతలకు బహుమతులను, మెడల్స్‌ను అందజేసారు. ఈ పోటీలలో ఛాంపియన్ కప్‌ను నూకరాజు క్లబ్ కైవసం చేసుకోగా, రెండవ స్థానాన్ని శరత్ క్లబ్ టీమ్, 3వ స్థానాన్ని ఆనంద్ టీమ్ కైవసం చేసుకున్నాయి. ఈ సందర్భంగా కర్ణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ ఇటీవల హైదారాబాదులో జరిగిన దిశ సంఘటనతో ఆడపిల్లలు మేల్కోవాలని, ఆత్మరక్షణకు కావలసిన మెలకువలను కిక్‌బాక్సింగ్ ద్వారా నేర్చుకోవాలని అన్నారు. అనంతరం మహారాష్ట్రం నాసిక్‌నగరంలో వచ్చేనెల జరగబోయే జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు సిరసపల్లి నూకరాజు, బాటాశ్రీను, నిర్వాహకులు శర త్, నూకరాజు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



**డాక్టర్ వైస్సార్-జక్కంపూడి రామ్మోహన్ రావు మెమోరియల్ జూనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీల ఆహ్వాన పత్రికను టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొడాలి తనూజ నుంచి అందుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, గౌరవ మంత్రి వర్యులు ధర్మాన కృష్ణదాస్. రాజమహేంద్రవరంలో ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు ఈ పోటీలు జరగనున్నాయి.**

## నివేదిక కోరితే లంచం అడిగారు
## వైద్య ఉద్యోగి స్పందనలో పిర్యాదు



కాకినాడ: వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగిగా చేస్తూ తనపై నమోదైన ఆరోపణ విచారణ నివేదిక ఉన్నాతాధికారులకు సమర్పించ కుండా కాలయాపన చేస్తున్నందున నివేదిక సమర్పించాలని కోరినందుకు వైద్యఆరోగ్యశాఖ అధికారులు తనను లంచం అడిగారని బిక్కవోలు మండలం కొంకుదురు ప్రారధమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య పర్యావేక్షకుడు కర్రి సోమ పోచేశ్వరరావు ఆరోపించారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్ జిల్లా స్థాయి స్పందనలో జెసీ-రాజకుమారికి అర్జీ సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆరోగ్య పర్యావేక్షకునిగా పని చేస్తున్న తనపై కొందరు చేసిన పిర్యాదును అనుసరించి 2012లో తనపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయగా పిర్యాదు చేస్తూ విచారణ అనంతరం 2016లో ఆకేసును కోర్టు కొట్టివేసిందని తెలిపారు.కేసు నమోదైన అనంతరం 5నెలల పాటు తాను సస్పెంక్షన్‌కు గురిఅయ్యాని ఆకాలంలో తనకు రావలసిన ప్రభుత్వం ఆర్థిక ప్రయోజనాలు తిరిగి ఇచ్చేందకు శాఖా పరమైన దర్యాప్తు నివేదిక అందించాల్సిన దర్యాప్తు అధికారులు ధర్యాప్తు చేసినా నివేదికను ఉన్నతా ధికారులకు నివేదిక సమర్పించలేదని దాంతో తనకు రావాల్సిన ప్రయోజనాలు ఆగిపోయాయని తాను ఎన్నిమారులు నివేదిక ఇవ్వాలని కోరినా తాను నివేదిక ఇవ్వడంలేదని వాపోయారు.దర్యాప్తు నివేదికను శాఖాపరం చేసేందుకు తనను వేలాది రపాలయ లచం డిమాండ్ చేసారని ఆరోపించారు. ఈఅంశాన్ని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు పిర్యాదు చేయగా వారి నుండి కూడా లంచం డిమాండ్ వచ్చిందని తెలిపారు.విసిగి వేసారిన తాను జిల్లా పాలనాధికారులకు పిర్యాదు చేసానని తెలిపారు.దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగు విచారణ చేస్తామని హామీ ఇచ్చారన్నారు.

## అంతర్ విభాగ పరిశోధనలకు గీతం వర్శిటీ ప్రోత్సాహం

### వైస్ ఛాన్సలర్ ప్రొ. కె. శివరామకృష్ణ



సాగర్‌నగర్: వైవిధ్య భరితమైన పరిశోధనలు జరగాలంటే సైన్స్, ఇంజనీరింగ్, లా, మెడికల్, ఫార్మశీ, మేనేజ్‌మెంట్ విభాగాల మధ్య సమన్వయంతో అంతర్ విభాగ పరిశోధనలు అవసరమని వీటికి గితం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఎక్కువగా ప్రోత్సహిస్తుందని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. శివరామకృష్ణ పేర్కొన్నారు. గితం న్యాయ కళాశాలలో ప్రతిభావంతమైన పరిశోధనలు ఏ విధంగా నిర్వహించాలి అనే అంశంపై జరిగిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో ఆయన సోమవారం పాల్గొని ప్రసంగించారు. రీసెర్చి ప్రాజెక్టులు, పరిశోధనలు తాము పని చేస్తున్న విభాగంలోనే చేయాలనే నిబంధనలు పెట్టుకోరాదని ఫార్మశీ, వైద్య విభాగాలు ఇంజనీరింగ్ వైద్య విభాగాలు, ఇలా కలిసి నూతన పరిశోధనాంశాలపై దృష్టి సారించాలని సూచించారు. గితం స్కూల్ ఆఫ్‌లో డైరెక్టర్ ప్రొఫెసర్ అనితారావు అధ్యక్షత వహించి ప్రసంగిస్తూ పరిశోధనా ఫలితాలు మేధో హక్కుల కింద నమోదు కావాలన్నారు. న్యాయశాస్త్రంలో పరిశోధనలకు అడ్డగోడలు లేవని అంతరిక్ష చట్టాల నుంచి సామాన్య ప్రజల ఇబ్బందుల వరకు ఏ అంశంపైనా అయినా పరిశోధనలకు అవకాశం ఉందన్నారు.

కార్యక్రమంలో ఎమిటీలా స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కె.ఎల్. విభూతే డిజిటల్ యుగంలో పరిశోధనకులకు సమాచారం సేకరణకు గల అవకాశాలను వివరించారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాలాజీ, రీసెర్చ్ విభాగం డైరెక్టర్ ప్రొ. రాజా. పి. పప్పు, గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రొ. ఎన్. సాయి సుధాకర్, ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. ఎస్. సుమిత్ర, ప్రొ. బి. పద్మానారాయణన్ తదితరులు వివిధ అంశాలపై ప్రసంగించారు.

# విద్యుత్ పొదుపును ఉద్యమంలా చేపట్టాలి



### ఇంధన వనరులు కాపాడుకోవాలి

### జిల్లా జాయింట్ కలెక్టరు ఎం.వేణుగోపాల్ రెడ్డి

విశాఖపట్నం: విద్యుత్ పొదుపును సమాజంలో ప్రతి ఒక్కరు ఒక ఉద్యమంలా చేపట్టడం ద్వారా అత్యంత విలువైన ఇంధన వనరులను కాపాడుకోగలుగుతామని జిల్లా జాయింట్ కలెక్టరు ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం నాడు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా జిల్లా ఇంధన పరిరక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంధన వనరుల సంరక్షణ కై కట్టుబడతామని అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు విద్యుత్ పొదుపుపై తాము చేపట్టిన కార్యక్రమాలపై వివరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 20 వరకు జరుగుతున్న ఇంధన పొదుపు వారోత్సవాలలో ముఖ్యంగా రైతులకు కెపాసిటర్ల వినియోగంపై అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను కోరారు. అన్ని పంచాయితీలలో ఎల్.ఇ.డి బల్బులను వినియోగించాలని తెలిపారు. గృహ వినియోగదారులు కూడా స్టార్ రేటింగ్ కలిగిన గృహ ఉపకరణాలను మరియు ఎల్.ఇ.డి బల్బులను వాడడం వలన కరెంటు బిల్లు తగ్గడమే కాకుండా కాలుష్యాన్ని కూడా తగ్గించిన వారు అవుతారని తెలిపారు. అవసరం లేని సమయంలో ఉపకరణాలను స్విచ్ ఆఫ్ చేసి విద్యుత్ ను పొదుపు చేయడం విద్యార్థి దశ నుండి అలవాటు చేయాలని తెలిపారు. సోలార్ రూఫ్ టాప్ లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా అత్యంత విలువైన బొగ్గు, గ్యాస్, క్రూడ్ ఆయిల్ లాంటి శిలాజ ఇంధనాలను తరిగిపోకుండా కాపాడుకోగలుగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.కిషోర్, ఎస్.ఇ. ఆర్డబ్ల్యూయస్ వి.రవికుమార్, ఎన్ఆర్ఇడిసి ఎపి జిల్లా మేనేజర్ సత్యనారాయణ, ఇపిడిసియల్ ఎస్.ఇ సూర్య ప్రకాశ్ , ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విశాఖ ఉక్కులో ఘనంగా జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం

గాజువాక: ఆర్ఐఎన్ఎల్ విశాఖ ఉక్కు కర్మాగారం యాజమాన్యం ఆధ్వర్యంలో ఉక్కునగరంలో జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సంస్థ సి.యం.డి. పి.కె.రథ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ దేశంలోనే ఉత్తమ ఇంధన సామర్థ్యం కల్గిన పరిశ్రమగా విశాఖ ఉక్కు గుర్తించబడిందని అన్నారు. దీనికి సంబంధించి అనేక అవార్డులను గెలుచుకుందని ఇది సంస్థలోని అందరి సమిష్టితో సాధ్యపడిందని అన్నారు. సంస్థ ఇంధన పరిరక్షణకు ఎల్లప్పుడూ ప్రాధాన్యతనిస్తుందని అన్నారు. సంస్థలో ఇంధన సామర్థ్య పద్ధతులను అంతర్జాతీయ ప్రామాణాలతో అవలంబించడం వలన సంస్థకు పురస్కారాలను తెచ్చిపెడుతుందని అన్నారు. మొత్తం విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యంలో 62శాతం వాటా కల్గిన వివిధ సౌకర్యాలలో సంస్థఅనేక వ్యర్థ ఉష్ణ రికవరీ టెక్నాలజీలను







ఏర్పాటుచేసిందని పేర్కొన్నారు. ఉక్కుపరిశ్రమలో కీలకమైన టెక్నో-ఎకనామిక్ పారామితులలో ఇంధన పరిరక్షణ ఒకటని ఇది సంస్థ యొక్క దిగువ శ్రేణిని గణనీయంగా మెరుగుపర్చడంలో సహాయపడుతుందని అన్నారు. అనంతరం నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేసారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వి.వి.వేణుగోపాలరావు, డి.కె.మహంతి, కె.కె.ఘోష్, ఎకె సక్సేనా, విద్యాసాగర్, ఇడిలు, మేనేజర్లు, పలు యూనియన్‌ల ప్రతినిధులు, ఉద్యోగులు, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నవరత్నాలను ప్రజలకందించండి

- సంక్షేమ పథకాలపై అవగాహన కలిగించాలి
- 39వ వార్డు నాయకుడు బంగారురాజుతో వైకాపా ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు



మాధవధార: వైసీపీ ఉత్తర నియోజకవర్గం సమన్వయ కర్త కెకె రాజును వైసీపి 39వ వార్డు నాయకుడు సనపల బంగారురాజు సోమవారం మర్యాద పుర్వకంగా కలిశారు . ఈమేరకు వార్డు పరంగా ఉన్న సమస్యలను కెకె రాజుకు వివరించారు . ఈ సందర్భంగా సనపల బంగారురాజు పుష్పగుచ్చంతోఅభినందించారు. కెకె.రాజు మాట్లాడుతూ 39వ వార్డులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయ్యాలని సుచించారు . వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పేద ప్రజలకు అనేక సంక్షేమ సేవా కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని తెలిపిన ఆయన నవరత్నాల్లో భాగంగా అమ్మఒడి, ఆరోగ్య శ్రీ, వాహనమిత్ర, నాణ్యమైన బియ్యం పంపిణి తదితర అనేక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తినుకోని వెళ్ళాలని అన్నారు . సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అర్హులైన పేద ప్రజలకు సంక్షేమ పథకాలను చేరువ చెయ్యాలని వివరించారు .



విశాఖ నగరంలో ఈ నెల 19 నుండి 22వరకు జరగనున్న ఆలిండియా పోలీస్ లాన్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్-2019 పోటీలకు దేశంలో అన్ని రాష్ట్రాలనుండి పోలీసులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పోలీసు సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో నగర పోలీసు కమిషనర్ ఆర్కే మీనా, విశాఖ రేంజ్ డిఐజి ఎల్.కె.వి. రంగారావు, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సీఏఏ నిరసన సెగలు

### జర్నలిస్టులపై దాడి



న్యూఢిల్లీ: పౌరసత్వ సవరణ బిల్లు (సీఏఏ)కు వ్యతిరేకంగా సోమవారం కూడా ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ వద్ద నిరసనలు కొనసాగాయి. యూనివర్సిటీ గేట్-1 వద్ద విద్యార్థుల నిరసనలను కవర్ చేస్తుండగా ఇద్దరు జర్నలిస్టులపై కొందరు గుర్తుతెలియని దుండగులు దాడి చేశారు. ఏఎన్ఐ వార్తాసంస్థకు చెందిన రిపోర్టర్ ఉజ్వల్ రాయ్, కెమెరాపర్సన్ సరబ్‌జీత్ సింగ్‌పై కొందరు దాడి చేయడంతో వారికి గాయాలయ్యాయి. దీంతో వారిని ఢిల్లీలోని హోలీ ఫ్యామిలీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు.

## అసెంబ్లీకి 'రివర్స్' వాక్

### ఆరో రోజు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం

అమరావతి: ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఆరో రోజు ప్రారంభమయ్యాయి. సోమవారం రాష్ట్రంలో రివర్స్ పాలన- తిరోగమనంలో రాష్ట్ర అభివృద్ధి అంశంపై టీడీపీ వినూత్నంగా ఆందోళనలు చేపట్టింది. ప్రతిపక్ష నేత చంద్రబాబు అధ్యక్షతన నిరసన చేపట్టారు.. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సచివాలయం ఫైర్ స్టేషన్ నుంచి నిరసన ర్యాలీ చేపట్టారు. వెనక్కి నడుస్తూ నిరసన తెలియజేశారు. చంద్రబాబు సహా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీకి రివర్స్ వాక్ చేశారు. రాష్ట్రంలో టెండర్లన్నీ రిజర్వు చేసుకుని రివర్స్ టెండరింగ్ పేరుతో అబద్ధాలు చెబుతున్నారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ. 2 లక్షల కోట్ల విలువైన అమరావతిని చంపేశారని.. రాష్ట్రంలో ఉన్మాది పాలన.. తుగ్లక్ పాలన నడుస్తోందని ఘాటు విమర్శలు చేశారు. పెట్టుబడులు పెట్టడానికి ఎవరూ ముందుకు రావడం లేదని.. మనకు రాజధాని లేకుండా చేశారని చంద్రబాబు మండిపడ్డారు. అలాగే రాష్ట్రంలో రివర్స్ పాలనకు వ్యతిరేకంగా టీడీపీ అసెంబ్లీ వాయిదా తీర్మానం ప్రవేశపెట్టింది. ఇదిలా ఉంటే అసెంబ్లీలో 13 బిల్లులకు ఆమోదం తెలపనున్నారు. ఎస్సీ కమిషన్ బిల్లు, ఎస్టీ కమిషన్ బిల్లు, ఎక్సైజ్ చట్టంలో సవరణలకు సంబందించి రెండు బిల్లులు, ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లుతో పాటు మొత్తం 13 బిల్లులకు ఆమోదం తెలపనున్నారు. అలాగే నూతన మద్యం విధానంపై స్వల్పకాలిక చర్చ జరగనుంది. అసెంబ్లీ సమావేశాలు ఆరు రోజులుగా జరుగుతున్నాయి. రోజుకో అంశంపై టీడీపీ ఆందోళనలు చేపడుతోంది. ఉల్లిధరలు, రైతుల సమస్యలు, 2430 జీవో, ఆర్టీసీ ఛార్జీల పెంపు, రివర్స్ టెండరింగ్ ఇలా కీలకమైన అంశాలపై నిరసన తెలియజేసింది. రోజుకో విధంగా వినూత్న రీతిలో చంద్రబాబు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

# నాబార్డు వార్షిక ప్రణాళిక విడుదల: కలెక్టర్ జె. నివాస్

శ్రీకాకుళం: 2020 21 ఆర్థిక సంవత్సరానికి నాబార్డు రూపొందించిన వార్షిక ప్రణాళికను జిల్లా కలెక్టర్ జె నివాస్ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో విడుదల చేసారు. రూ.7864.30 కోట్లతో రూపొందించిన ఈ ప్రణాళికలో పంట ఉత్పత్తి, నిర్వహణ, మార్కెటింగ్ కు రూ.4141.36 కోట్లు., వ్యవసాయం, అనుబంధ కార్యక్రమాలకు టర్మ్ రుణాలుగా రూ.1218.78 కోట్లు., వ్యవసాయ మౌళిక సదుపాయాలకు రూ.251 కోట్లు., అనుబంధ కార్యక్రమాలకు రూ.482 కోట్లు వెరసి వ్యవసాయ రంగానికి రూ.6093.56 కోట్లు కేటాయింపు చేయడం జరిగింది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎం.ఎస్.ఎం.ఇ) రూ.1206.62 కోట్లు., ఎగుమతి పరపతి (ఎక్స్ పోర్టు క్రెడిట్) కు రూ. 10.50 కోట్లు., విద్యా రంగానికి రూ.26.08 కోట్లు., గృహనిర్మాణానికి రూ.328.41 కోట్లు., సాంప్రదాయ ఇంధన రంగానికి (రెన్యువబుల్ ఎనర్జీ) రూ.11.21 కోట్లు., బ్యాంకు క్రెడిట్ అనుసంధానంతో సామాజిక మౌళికసదుపాయాల కల్పనకు రూ.79 కోట్లు కేటాయించడం జరిగింది. ఇందులో వ్యవసాయ రంగంలో పంట ఉత్పత్తి, నిర్వహణ, మార్కెటింగ్ రంగాలకు సంబంధించి జలవనరులకు రూ.117.51 కోట్లు, యాంత్రీకరణకు రూ. 146 కోట్లు, ఉద్యాన, సెరీకల్చర్ తదితర మొక్కలు నాటుటకు రూ. 68.51 కోట్లు., అటవీ, బంజరు భూముల అభివృద్ధికి రూ.18 కోట్లు, డైరీ యూనిట్లకు రూ. 327 కోట్లు, పౌల్ట్రీ యూనిట్లుకు రూ.58 కోట్లు., మేకలు, గొర్రెలు, పందులు తదితరర పెంపకాలకు రూ.64 కోట్లు., మత్స్య రంగానికి రూ.43 కోట్లు, వ్యవసాయ పరపతి, ఇతర రంగాలకు రూ. 376 కోట్లు ఖర్చు చేయుటకు ప్రణాళికలు రూపొందించారు. వ్యవసాయ మౌళికసదుపాయాల కల్పనలో భాగంగా గిడ్డంగులు, మార్కెట్ యార్డులు, శీతల గిడ్డంగులు తదితర అంశాలకు రూ.68 కోట్లు., భూ అభివృద్ధి, భూసార పరిరక్షణ, వాటర్ షెడ్ అభివృద్ధికి రూ.109 కోట్లు., వ్యవసాయ మౌళికసదుపాయలు, యితర అంశాలకు రూ.73 కోట్లను కేటాయించారు. ఆహార, వ్యవసాయ శుద్ధి పరిశ్రమలకు రూ.61 కోట్లు, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు, ఇతర రంగాలకు రూ.73 కోట్లు ప్రణాళికలో కేటాయించారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ -2 ఆర్.గున్నయ్య, జిల్లా రెవిన్యూ అధికారి బలివాడ దయానిధి, నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ మిలింద్ సోవల్కర్ , లీడ్ బ్యాంకు మేనేజర్ జి.హరిప్రసాద్, ఆంధ్రా బ్యాంకు జోనల్ మేనేజర్ పి.కృష్ణయ్య, భారతీయ స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ అరవింద్ జ్యోతిర్మయి, చీఫ్ మేనేజర్ సుబ్బారావు, ఏపిజివిబి రీజనల్ మేనేజర్ గురునాథరావు, డిసిసిబి సిఇఓ డి.సత్యనారాయణ, సిండికేట్, ఐసిఐసి బ్యాంకు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విజయనగరంలో అవినీతి చేపలు..

### ఏసీబీకి చిక్కిన ఇద్దరు అధికారులు

విజయనగరం జిల్లాలో ఇద్దరు అవినీతి అధికారులు ఏసీబీ వలలో చిక్కారు. రూ.85 వేలు లంచం తీసుకుంటుండగా.. చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ పి.మణిమాల, కొత్తవలస ఐసీడీఎస్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తోన్న జీవీకే వేణుగోపాల్‌లను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అడారి సురేశ్ కుమార్ అనే వ్యక్తి అంగన్‌వాడీ కేంద్రాలకు కూరగాయలు, సరుకులను సరఫరా చేస్తుంటారు. ఆయనకు నవంబర్ నెల బిల్లులు రావాల్సి ఉంది.

## పౌరసత్వ వివాదం: నిరసనకు దిగిన ప్రియాంక

### విద్యార్థుల ఆందోళనకు సంఘీభావం

న్యూఢిల్లీ: పౌరసత్వ సవరణ చట్టంపై కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ నిరసన చేపట్టారు. ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద పార్టీ శ్రేణులతో కలిసి ఆమె ధర్నాకు దిగారు. విద్యార్థులు, ఆందోళనకారులపై పోలీసుల చర్యలను తప్పుపడుతూ ఆమె నిరసన వ్యక్తం చేశారు. పౌరసత్వ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టిన జామియా మిలియా వర్సిటీ విద్యార్థులపై దాడిని ఆమె ఖండించారు. ఈ సందర్భంగా ఆందోళనకారుల నిరసనలకు ఆమె సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, ఆందోళనకారులు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగా ఢిల్లీలోని జామియా మిలియా వర్సిటీలో ఆందోళనకారులు పలు బస్సులను తగలబెట్టడంతో హింసాత్మకంగా మారిన విషయం తెలిసిందే. మంటలను ఆర్పేందుకు వస్తున్న అగ్నిమాపక వాహనాలను కూడా విద్యార్థులు ధ్వంసం చేశారు. పోలీసుల లాఠీ చార్జిలో పలువురు విద్యార్థులు, ఆందోళనకారులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై ప్రధాని మోదీ సహా, పలువురు ప్రముఖులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.



VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 Phone : 2564353, Fax : 0891-2569004 e-mail: vijayabhanudaily@gmail.com